Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 80 మేడ్చల్ మల్కాజ్‌గిరి 12 ఏప్రిల్ 2023 బుధవారం పేజీలు : 4

## 'అమర్‌నాథ్ యాత్ర'పై ఉగ్ర కుట్ర.. రహస్య సొరంగం గుర్తింపు

జమ్మూ: త్వరలోనే జరగబోయే వార్షిక అమరనాథ్ యాత్రను లక్ష్యంగా చేసుకొని పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదులు చేసిన కుట్రను సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) సిబ్బంది భగ్నం చేశారు. జమ్మూ కశ్మీర్‌లో అంతర్జాతీయ సరిహద్దు వద్ద ఓ రహస్య సొరంగాన్ని గుర్తించారు. సాంబా జిల్లాలోని చాక్ ఫకీరా బోర్డర్ అవుట్‌పోస్ట్‌కు సమీపంలోని 150 మీ టర్ల సొరంగం ఉన్నట్లు గుర్తించామని బీఎస్ ఎఫ్ అధికారులు వెల్లడించారు. ఈ సొరంగాన్ని ఇటీవలే తవ్వారని, పాక్ భూభాగం నుంచే ఈ సొరంగం ఉన్నట్లు బీఎస్ఎఫ్ డీఐజీ ఎస్‌పీఎస్ సంధు తెలిపారు. అవుట్‌పోస్ట్‌కు కేవలం 300 మీటర్ల దూరంలోనే ఇది ఉన్నట్లు తెలిపారు. ఈ సొరంగం నుంచి భారత్‌లోని చివరి గ్రామానికి దూరం కేవలం 700 మీటర్లేనని చెప్పారు. అమర్‌నాథ్ యాత్రకు భంగం కలిగించేందుకు ముష్కరులు ఈ సొరంగం నుంచి భారత భూభాగంలోకి చొరబడేలా ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది.

# మోదీ – అదానీలే... 'వైజాగ్' పొట్టగొడుతోంది




## నేను చెప్పింది అబద్ధమైతే పరువు నష్టం దావా వేయండి : మంత్రి కేటీఆర్

వైజాగ్ స్టీల్ ప్లాంట్ టేకోవర్‌పై బీజేపీ నాయకులు చేస్తున్న ఆరోపణలపై మంత్రి కేటీఆర్ సీరియస్ అయ్యారు. విశాఖ ఉక్కు విషయంలో చూపిస్తున్న ఉత్సాహం బయ్యారం విషయంలో ఎందుకు చూపిస్తలేరని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు అడుగుతున్న ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. విషయం పరిజ్ఞానం లేని ఆయనకు చెబితే ఓ బాధ.. చెప్పకుంటే ఓ బాధ అని మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఆయనకు వచ్చిన సందేహం మరెవరికీ రావొద్దనే ఉద్దేశంతో దీనిపై పూర్తి వివరణ ఇచ్చారు. ' మీరు విశాఖ ఉక్కు విషయంలో చూపిస్తున్న ఉత్సాహం.. బయ్యారం విషయంలో ఎందుకు లేదు అని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మాట్లాడినట్లుగా ఇవాళ పత్రికల్లో చూశా. ఆయనకేమో విషయ పరిజ్ఞానం లేదు. విషయం తెలియదు. ఆయనకు చెబితే ఒక బాధ.. చెప్పకపోతే ఒక బాధ. ఆయన విచిత్రమైన మనిషి. ఎప్పుడు ఏం మాట్లాడతాడో.. ఎలా మాట్లాడతాడో.. ఎందుకు మాట్లాడుతాడో అర్థం కాదు. కానీ ఆయన లేవనెత్తిన ప్రశ్న.. వేరేవాళ్లకు వస్తే వారికి అయినా సమాధానం చెప్పాల్సిన బాధ్యత మామీద ఉంది.' అంటూ దాని వెనుక ఉన్న అసలు విషయాన్ని క్షుణ్ణంగా వివరించారు. ' విశాఖ ఉక్కుకు, బయ్యారం స్టీల్ ప్లాంట్‌కు మధ్య ఉన్న ముఖ్యమైన సంబంధం బైలదిల్లాలో ఉండే ఐరన్ ఓర్. బైలదిల్లా అనేది ఛత్తీస్‌గఢ్ నుంచి ఒడిశా దాకా వ్యాపించిన ఐరన్ ఓర్ గని. ఇది చాలా పెద్ద గని. 134 కోట్ల మెట్రిక్ టన్నుల ఐరన్ ఓర్ ఉన్న గని బైలదిల్లా. భౌగోళికంగా చూస్తే ఇది బయ్యారం నుంచి 150–160 కిలోమీటర్ల దూరంలో ఉంది. వైజాగ్ నుంచి 600 కిలోమీటర్ల దూరంలో ఉంది. బైలదిల్లాలో నాణ్యమైన ఐరన్ ఓర్ ఉందని కేంద్ర ప్రభుత్వ సంస్థలే తేల్చిచెప్పాయి. ' అని తెలిపారు.

**బయ్యారం గురించి 2014 నుంచి అడుగుతూనే ఉన్నాం –** 2014లో రాష్ట్రం ఏర్పడినప్పుడు బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో వివరంగా చెప్పారు. అదేవిధంగా కడపలో కూడా స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా ద్వారా అక్కడ స్టీల్ ప్లాంట్ పెట్టే అవకాశాన్ని పరిశీలిస్తామని పేర్కొన్నారు. తెలంగాణలోని బయ్యారం గురించి మేం అడగగలం కాబట్టి.. 2014 నుంచి అడుగడుగున ప్రశ్నిస్తూ వస్తున్నాం. దీని గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని సీఎం కేంద్రానికి ఉత్తరాలు రాశారు. పరిశ్రమల మంత్రిగా కొన్నిరోజులు మైన్స్ డిపార్ట్‌మెంట్ చూసిన సమయంలో కేంద్రమంత్రులను కలిశా. వీరేంద్ర చౌదరి స్టీల్ మినిస్టర్‌గా ఉన్నప్పుడు ఎన్ఎండీసీ 50వ వార్షికోత్సవానికి వస్తే హైదరాబాద్‌లోనే అడిగాం. బయ్యారంలో స్టీల్ ప్లాంట్ ఎందుకు పెడతలేరని అడిగితే.. సా ధ్యాసాధ్యాలను పరిశీలిద్దాం. కానీ కొత్తగూడెంలో ఒక ప్లాంట్ పెడదాం. ఇంకో దగ్గర ఇంకో పరిశ్రమ పెడదామంటూ చెప్పుకొచ్చారు. జూన్ 20 18లో స్వయంగా ప్రధాని మోదీని కలిసి బయ్యారం గురించి మాట్లాడినం.

**ప్రధాని మోదీకి కూడా వివరించాం –** బయ్యారం గురించి మిమ్మల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని దానిపై వివరించాం. బయ్యారం ఎక్కడైతే ఉందో అక్కడ దొరికే ఐరన్ ఓర్ లో గ్రేడ్ ఉందని.. ఫెర్రస్ నాణ్యత 64 శాతం ఉంది కాబట్టి సాధ్యం కాదని మీ వాళ్లు తప్పుదోవ పట్టిస్తున్నారని చెప్పా. కానీ బయ్యారం నుంచి 150–160 కిలోమీటర్లలోపే బైలదిల్లా ఉంది. బైలదిల్లా నుంచి మొత్తం ఫారెస్టే ఉంది. కాబట్టి మనం ఒక స్లరీ పైప్‌లైన్ వేసుకోవచ్చు. స్లరీ పైప్‌లైన్ వేయడంలో 50 శాతం వాటా తెలంగాణ ప్రభుత్వం కూడా భరిస్తుంది. బయ్యారంలో ప్లాంట్ పెడితే 15, 20వేల మంది మా గిరిజన బిడ్డలకు ఉద్యోగ అవకాశాలు వస్తాయి. తెలంగాణకు ఆదాయం వస్తుంది. ఒక వెనుకబడిన ప్రాంతానికి ఫ్యాక్టరీ వస్తుంది. మీరిచ్చిన మాట నిలబెట్టుకున్నట్టు అవుతుంది. అని 2018లో స్వయంగా ప్రధాని మోదీని కలిసి విజ్ఞప్తి చేశా. మొత్తం వివరాలను సమర్పించా. అప్పటికే ముఖ్యమంత్రి, అధికారుల బృందాలు కలిసి చెప్పాయి.

**ఇదీ అసలు కుట్ర –** కానీ దీని వెనుక జరుగుతున్న కుట్రను అర్థం చేసుకోలేకపోయాం. ఒక కుక్కను చంపాలంటే దాన్ని పిచ్చికుక్క అని ముద్ర వేయాలి. ఆ తర్వాత అది పిచ్చికుక్క కాబట్టి కాల్చి చంపినమంటే ఎవరూ ఏమనరు కాబట్టి ఖతం చేయాలి. బైలదిల్లా విషయంలో కూడా ఇదే ఎజెండా. బయ్యారం విషయంలో కేంద్ర ప్రభుత్వం మాట ఇచ్చిందని మొదలుపెట్టగానే.. దీనివెనుక ఉన్న పాత్రధారులు, సూత్రధారులు కదిలారు. 2018 సెప్టెంబర్‌లో బైలదిల్లా ఐరన్ ఓర్ మైనింగ్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో అదానీ ఒక కంపెనీని తెరిచిండు. అంతకంటే ముందే కొంచెం కథ నడిచింది. జపనీస్ స్టీల్ మిల్స్‌కు, దక్షిణ కొరియాకు చెందిన పాస్కో కంపెనీకి బైలదిల్లా నుంచి ఐరన్ ఓర్ సప్లై చేస్తామని 2018 ఏప్రిల్‌లో కేంద్ర కేబినెట్ ఓ నిర్ణయం తీసుకుంది. బైలదిల్లాలో ఐరన్ ఓర్ మైనింగ్ స్టార్ట్ చేస్తున్నామని చెప్పింది. ఆ వెంటనే అదానీ ఈ కంపెనీని తెరిచాడు. ఇక్కడి మైనింగ్‌ను పాస్కోకు ఇస్తామని చెప్పంగనే.. వాళ్లను కలిసి 40వేల కోట్లు ( 5బిలియన్ డాలర్లు ) పెట్టుబడితో గుజరాత్‌లోని ముంద్రాలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ కంపెనీ పెడుతున్నా అని అదానీ స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఈ క్రమంలో పాస్కో కంపెనీ వైజాగ్‌లో స్టీల్ ప్లాంట్ పెడుతుందా అని ఆంధ్రప్రదేశ్ ఎంపీ విజయసాయిరెడ్డి 2021 అక్టోబర్‌లో పార్లమెంట్‌లో ఒక ప్రశ్న అడిగిండు. దానికి పాస్కో కంపెనీ ఆలోచన చేస్తుందని కేంద్రం సమాధానమిచ్చింది. 2019 అక్టోబర్‌లో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి వచ్చి పరిశీలించారు. అక్కడ ఉక్కు ఫ్యాక్టరీ పెట్టే ఆలోచనలో ఉన్నారని కేంద్రం బదులిచ్చింది.

**అదానీ కోసం రెండు తెలుగు రాష్ట్రాలకు చావుదెబ్బ –** ఇక్కడ ఫైనల్ స్టోరీ ఏంటంటే.. బైలదిల్లా నుంచి బయ్యారానికి ఐరన్ ఓర్ ఇస్తే అదానీకి నష్టం. అటు వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు సప్లై చేస్తే.. ముంద్రాలో అదానీ పాస్కో పెట్టాలని సంకల్పించిన ప్లాంట్‌కు నష్టం. అందుకే ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్టుగా ఒక బైలదిల్లాను అదానీకి కట్టబెట్టడంతో రెండు తెలుగు రాష్ట్రాలను చావుదెబ్బ తీసింది. బయ్యారంలో స్టీల్ ప్లాంట్ పెడదామంటే అదానీకి మన జుట్టు ఇవ్వాలి. అదానీ, మోదీ **(మిగతా 4వ పేజీలో)**



## నాన్ బీజేపీ రాష్ట్రాలపై కేంద్రం సహాయ నిరాకరణ: మంత్రి కేటీఆర్

హైదరాబాద్: నాన్ బీజేపీ రాష్ట్రాల పట్ల కేంద్రం అనుసరిస్తున్న వైఖరిని మంత్రి కేటీఆర్ తప్పుపట్టారు. ఇవాళ ఆయన తన ట్విట్టర్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. గవర్నర్ల వ్యవస్థను రద్దు చేయాలని అభిప్రాయపడుతూ తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ మీడియా డైరెక్టర్ కొణతం దిలీప్ చేసిన ట్వీట్‌ను మంత్రి కేటీఆర్ రీట్వీట్ చేశారు. ఆ ట్వీట్‌కు కేటీఆర్ తన కామెంట్ జోడించారు.

# పొగ బెట్టి బయటకు పంపే కేసీఆర్.. వేటు వేసే వరకు వెళ్లారేం?

హైదరాబాద్ : అలవాటు లేని పనులు చేయరు కొందరు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రం చేయాల్సి వస్తుంది. తాజాగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అలాంటి పనే చేశారా? అంటే అవునని చెప్పాలి. ఇప్పటి బీఆర్ఎస్.. అప్పటి టీఆర్ఎస్ పెట్టిన నాటి నుంచి ఇప్పటివరకు చూస్తే.. పార్టీలో తనకు ఇబ్బందికరంగా మారిన నేతల్ని బయటకు పంపేందుకు రోటీన్ కు భిన్నంగా వ్యవహరిస్తుంటారు. ఎవరిదాకానో ఎందుకు? అలె నరేంద్రనే తీసుకుంటే.. అంతటి పెద్ద నాయకుడు సైతం చాలా ఇబ్బందికర పరిస్థితుల్లో నోటి నుంచి మాట లేక.. మౌనంగా గులాబీ కారు దిగిపోయారే కానీ.. ఆయనపై వేటు వేసింది లేదు. ఒక్క అలె నరేంద్ర మాత్రమే కాదు. ఎంతో మంది తోపు నాయకులు అనే వారు సైతం గులాబీ సారు తీర్థం తీసుకున్న తర్వాత తమ తీరు మార్చుకోవాల్సిందే. లేకుంటే.. వారి పని అంతే అన్న మాట వినిపిస్తుంది. పార్టీలోని ఏ నేతతో అయినా పొసగకుంటే.. పొగ పెట్టి ఉక్కిరిబిక్కిరి చేయటం.. ఊపిరి ఆడకుండా చేయటం.. తమకు తాముగా బయటకు వెళ్లేలా చేయటం కేసీఆర్ కు అలవాటుగా చెబుతారు. అలాంటి ఆయన.. తాజాగా మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించారు. పార్టీకి చెందిన ఇద్దరు ముఖ్యనేతల విషయంలో ఆయన వేటు వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఎందుకిలా చేశారు?



అన్నదిప్పుడు ఆసక్తికర ప్రశ్నగా మారింది. పార్టీకి చెందిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని.. మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఇద్దరిపైనా వేటు వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. నిన్నటి రోజున (ఆదివారం) తమ అనుచరులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించిన వీరిద్దరూ కేసీఆరర్ సర్కారుపై తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. నిజానికి దాదాపు ఏడాదిగా పొంగులేటి తన బాస్ కేసీఆర్ మీద కోపంగా ఉన్నారు. తన ఆగ్రహాన్ని ఆయన ఎప్పుడూ దాచుకున్నది లేదు. ఎప్పటికప్పుడు తన కోపాన్ని బయటపెడుతూ ఉన్నా.. అసలేం జరగనట్లుగా వ్యవహరించిన కేసీఆర్ అండ్ కో ఇప్పుడు మాత్రం అందుకు భిన్నంగా వేటు వేశారెందుకు? అన్నది ప్రశ్న. టీఆర్ఎస్ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం.. పొంగులేటి.. జూపల్లి విషయంలో కేసీఆర్ గుర్రుగా ఉన్నారని.. అందులో భాగంగా వారిద్దరికి ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వకుండా ఉండటం.. వారిని ఇగ్నోర్ చేయటం లాంటివెన్నో చేసినా.. వారు గులాబీ కారును దిగలేదంటున్నారు. గత నేతలకు భిన్నంగా వారు.. పార్టీలోనే ఉండి అధినేతను ఇరుకున పడేలా చేయటం షురూ చేయటం కేసీఆర్ కు కొత్త అనుభవాన్ని పరిచయం చేశారని చెబుతున్నారు. అయితే.. ఈ తీరు అంతకంతకూ ఎక్కువ కావటం.. ఇదే తీరులో వదిలేస్తే.. వారిని స్ఫూర్తిగా తీసుకొని మిగిలిన వారు సైతం ఇదే బాట పడితే.. పార్టీకి జరిగే నష్టం భారీగా ఉంటుందన్న ఆలోచనతోనే ఈ తరహా నిర్ణయాన్ని తీసుకున్నట్లుగా తెలుస్తోంది. పార్టీ గతంలో మాదిరి పరిమితం కాకుండా.. పరిధి పెరుగుతున్న వేళలో క్రమశిక్షణ చాలా ముఖ్యమని.. ఆ విషయంలో చూస్తూ ఊరుకుంటే రానున్న రోజుల్లో మరింత నష్టం వాటిల్లుతుందన్న ఉద్దేశంతోనే వేటు వేసే నిర్ణయాన్ని తీసుకున్నారని చెబుతున్నారు. తనకు అలవాటు లేని ఆటకు తెర తీసిన కేసీఆర్.. వేటు ప్రకంపనల్ని ఎలా డీల్ చేస్తారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారిందని చెప్పాలి.

# అమాంతం పెరిగిన 'బండి' ఇమేజ్!!



## సంజయ్ వ్యతిరేక వర్గంలో గుబులు!!

హైదరాబాద్ : ఆసక్తిగా ఎదురుచూసిన ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటన పూర్తైంది కేవలం రెండు గంటల మాత్రమే ఉన్న ఆయన.. ఆ స్వల్ప వ్యవధిలోనే చేయాల్సిన పనులు చాలానే చేశారు. ఇవ్వాల్సిన సంకేతాలుచాలానే ఇచ్చేశారని చెప్పాలి. ప్రధాని మోడీ పర్యటన సందర్భంగా కొత్త విషయం ఒకటి బయటకు వచ్చింది. అదిప్పుడు ఆసక్తికరంగా మారింది.

తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ ఎంతో కాలంగా ఉన్నప్పటికీ.. ఆ పార్టీకి చెందిన ఒక నాయకుడు ప్రజల్లో నానటం.. అందరి అభిమానం పొందటం లాంటివి ఇంతవరకు లేదనే చెప్పాలి. అప్పుడెప్పుడో అలె నరేంద్ర తప్పించి.. ఆ తర్వాత జనాలకు బాగా దగ్గర కావటం.. రాష్ట్ర వ్యాప్త నాయకుడిగా గుర్తింపు పొందిన దాఖలాలు కనిపించవు. తెలుగు రాష్ట్రాలకు చెందిన వెంకయ్యనాయుడు.. కిషన్ రెడ్డి.. లక్ష్మణ్ లాంటి నేతలు బీజేపీలో పెద్ద స్థానాలకు చేరినప్పటికీ ప్రజల్లో వారికున్న ఆదరణ పరిమితమే. అందుకు భిన్నంగా బండి సంజయ్ ఇప్పుడు కొత్త ఇమేజ్ ను సొంతం చేసుకున్నారన్న విషయాన్ని పరేడ్ గ్రౌండ్స్ సభ స్పష్టం చేసింది. పదునైన వ్యాఖ్యలకు కేరాఫ్ అడ్రస్ గా.. ముఖ్యమంత్రి కేసీఆర్.. మంత్రి కేటీఆర్ మొదలు కొని.. ఎవరినైనా ఎంత మాట అయినా అనేసే సత్తా బండి సంజయ్ సొంతంగా చెప్పాలి. ఆయన మాటల్లో విషయం ఉండదన్న విమర్శ కొందరు మేధావులు చేసినా.. అవేమీ సాదాసీదా ప్రజలకు అవసరం లేదన్న విషయాన్ని వారు మర్చిపోతుంటారు. అందుకేనేమో.. తాను మేధావులకు నచ్చే నాయకుడ్ని కాదన్నట్లుగా బండి తీరు ఉంటుంది. ఇటీవల పదో తరగతి పరీక్షా పత్రాన్ని లీక్ చేశారన్న ఆరోపణలతో జైలుకు వెళ్లటం.. రెండోరోజుకే బెయిల్ మీద బయటకు రావటం తెలిసిందే. ఈ ఎపిసోడ్ ఆయన ఇమేజ్ కు దెబ్బ తగిలేలా చేసిందన్న ఆరోపణలు అర్థం లేనివన్న విషయం పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన సభ ద్వారా స్పష్టమైనట్లుగా చెప్పాలి. ఎందుకంటే.. మోడీ రావటానికి ముందు.. సభా ప్రాంగణమంతా బండి.. బండి.. పేరుతో మారుమోగింది. నిజానికి ఇలాంటి నినాదాలు ఒక్క మోడీకే దక్కుతాయి. తాజాగా బండి కూడా దక్కటమే కాదు.. ఆయన్ను తమ భుజాల మీదకు ఎక్కించుకొని గ్రౌండ్ చుట్టూ తిప్పిన వైనం చూస్తే.. సంజయ్ ఇమేజ్ ఎంతలా పెరిగిందన్న విషయం ఇట్టే అర్థం కాక మానదు. ఈ పరిణామం తెలంగాణ బీజేపీ నేతల్లో కొత్త సమీకరణాలకు కారణమవుతుందని భావిస్తున్నారు. బండి ఇమేజ్ ఇంతలా పెరగటాన్ని జీర్ణించుకోలేని కొందరు ఆయనకు చెక్ పెట్టే అవకాశం ఎలా దొరుకుతుందా? అన్న కోణంలో కసరత్తు చేస్తున్నట్లుగా చెబుతున్నారు. మరేం జరుగుతుందో చూడాలి.

# రద్దీ కష్టాలు ఇంకెన్నాళ్లు?

పెద్దపల్లి: పెద్దపల్లిలో పెరుగుతున్న వాహనాల రద్దీ పట్టణ వాసులకు ఇబ్బందికరంగా మారింది. కరోనా తర్వాత దూర ప్రాంతాలకు వెళ్లే భారీ వాహనాలతో పాటు స్థానికంగా వాహనాల సంఖ్య పెరగడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. అధికారిక గణాంకాల ప్రకారం జిల్లాకేంద్రంలోని రాజీవ్ రహదారి మీదుగా నిత్యం 12 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ లెక్కన నిమిషానికి 8 భారీ వాహనాలు వెళ్తున్నాయి. వీటికి స్థానికంగా తిరిగే కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు అదనం. పెరిగిన అవసరాలకు సరిపడా పట్టణంలో ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. ట్రాఫిక్ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన సిగ్నల్స్‌ను వాహనదారులు పట్టించుకోవడం లేదు. కనీసం సిగ్నల్స్ ఉన్న కూడళ్లలోనూ సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. మరోవైపు పట్టణంలో వాహనాల నియంత్రణ కోసం గతంలో ప్రతిపాదించిన బైపాస్ రహదారి నిర్మాణం కార్యరూపం దాల్చడం లేదు. గ్రామీణ ప్రాంతాల అనుబంధ రహదారులు అభివృద్ధికి నోచుకోవడం లేదు.

సూచికలు బేఖాతరు జిల్లాకేంద్రంలో బస్టాండ్ కూడలి, అయ్యప్ప కూడలి ప్రాంతాల్లో రెండేళ్ల కిందట ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. ఇటీవల పట్టణంలో ప్రమాదాల సంఖ్య పెరగడంతో మంథని ఆర్వోబీ, కూనారం



కూడలి, కమాన్ కూడలితో పాటు ఎస్సారెస్పీ క్యాంపులోని కలెక్టరేట్ కూడలి వద్ద ఆరు నెలల కిందట ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశారు. అయితే సాంకేతిక కారణాలతో ప్రారంభానికి నోచుకోలేదు. ఇక ట్రాఫిక్ సిగ్నల్స్ పడితే వాహనదారులు ఎడమ వైపు నుంచి తిరిగి వెళ్లడం, యూ టర్న్ తీసుకోవడం, మరికొందరు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పట్టించుకోకుండానే దూసుకెళ్లడం పరిపాటిగా మారింది. ముఖ్యంగా అయ్యప్పకూడలిలో బస్టాండ్ వైపు నుంచి వచ్చే వాహనదారులు జీబ్రా గీతలను పట్టించుకోకుండా క్రిస్టియన్‌కాలనీ వైపు వెళ్లే రోడ్డును మూసేలా రోడ్డుకు అడ్డంగా నిలుపుతున్నారు. దీంతో అటువైపు నుంచి వచ్చే వారికి, అటు వెళ్లాలనుకునేవారికి ఇబ్బందులు ఎదురవుతు న్నాయి.

ఊసే లేని 'అనుసంధానం' పెద్దపల్లి పట్టణం మీదుగా భారీ వాహనాలు రాకుండా ఉండేందుకు పదేళ్ల కిందట ప్రతిపాదించిన బైపాస్ రహదారి నిర్మాణ ప్రక్రియ రాష్ట్రావతరణ తర్వాత అటకెక్కింది. జిల్లా కేంద్రం చుట్టూ భూముల విలువలు భారీగా పెరగడంతో భవిష్యత్తులో భూసేకరణ జరిగి, బైపాస్‌ల నిర్మాణం కల నెరవేరుతుందనే ఆశలు పట్టణ వాసుల్లో కనిపించడం లేదు. కాగా పెద్దపల్లి చుట్టూ విస్తరించిన పలు గ్రామాలను కలిపే లింక్ రహదారులను అభివృద్ధి చేసి, విస్తరణ ప్రక్రియ చేపడితే కొంత ప్రయోజనం దక్కేది. ముఖ్యంగా పెద్దకల్వల నుంచి నిమ్మనపల్లి, నిట్టూరు, తుర్కలమద్దికుంట మీదుగా జగిత్యాల రోడ్డుతో అనుసంధానించేలా రహదారిని అభివృద్ధి చేసి, అక్కడి నుంచి రాజీవ్ రహదారి వరకు రోడ్డు నిర్మాణానికి భూ సేకరణ చేశారు. ఈ రోడ్డు చేయడం ద్వారా కొంతవరకు ప్రయోజనం కలుగుతుంది.

# మురుగు నీటి శుద్ధీకరణకు అంతరాయం తప్పేనా?

కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో మురుగునీటి శుద్ధీకరణ (ఎస్టీపీ) తప్పనిసరిగా మారింది. ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థాల నీటిని నదులు, కాల్వల్లో వదలకుండా భూగర్భ పైపులైను ద్వారా శుద్ధి కేంద్రానికి తరలించాలని జాతీయ హరిత న్యాయస్థానం పక్కాగా ఆదేశాలు ఇస్తుండటంతో ఆ దిశగా అధికారులు చర్యలు ప్రారంభించారు. పది రోజుల కిందట హైదరాబాద్ నుంచి సాంకేతిక నిపుణులు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవడానికి ఇక్కడి అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. మోటార్లు, ఫిల్టర్లు, ల్యాబ్, ఇంటింటా కనెక్షన్లు ఇచ్చే ప్రక్రియ మొదలుపెట్టేందుకు నివేదిక రూపొందించారు. ప్లాంటు నిర్మాణ సమయంలోనే విద్యుత్తు సౌకర్యం, జనరేటర్ ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు చేసి పనులు అప్పగించారు. ఇప్పుడు కేవలం కరెంటుతోనే కొనసాగిస్తామనడం గమనార్హం.

ప్రస్తుతం రోజుకు రెండు ఎంఎల్‌డీలు శుద్ధి

నగర శివారులోని గోపాల్‌చెరువు దగ్గర 38 ఎంఎల్‌డీల సామర్థ్యంతో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మించారు. 290 కిలోమీటర్ల పొడవున పైపులైన్లు వేయగా అందులో దిగువ ఉన్న ప్రాంతంలోని మారుతీనగర్, కాపువాడ, హుస్సేనీపుర ప్రాంతాలకు ఇంటింటా కనెక్షన్లు ఇచ్చారు. మొత్తం 45,000 ఇళ్లకు ఇవ్వాల్సి ఉండగా, నిధుల కొరతతో సుమారు 4,800 ఇళ్ల నుంచే వ్యర్థ జలం ఎస్టీపీలోకి చేరుతుంది. రోజుకు సుమారు 2 నుంచి 4 ఎంఎల్‌డీల నీటిని శుద్ధి చేస్తున్నారు. ఆతర్వాత ఆ జలాలను చెరువులకు, మొక్కలకు పంపిస్తున్నారు. ప్రస్తుతం విద్యుత్తు సౌకర్యం ఉన్నా.. శుద్ధి చేసేందుకు ఆశించిన స్థాయిలో మురుగు రావడం లేదు. వచ్చే నీరు పెరిగితే మాత్రం దానిని నిరంతరం ఉపయోగించాల్సి ఉంటుంది. లేదంటే పైపుల్లో నిండిందంతా ఇళ్లలోకి వెనక్కి వచ్చే ప్రమాదం ఉంటుంది. కరెంట్ పోయిన సందర్భాల్లో జనరేటర్ తప్పనిసరిగా అవసరముంటుంది.

పాత జనరేటర్ వెనక్కి..

మురుగునీటి శుద్ధి కేంద్రంలో ఒప్పందం ప్రకారం సదరు గుత్తేదారు 750 కేవీ జనరేటర్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. మూలన పడేసిన యంత్రాన్ని తీసుకొచ్చి జనరేటర్ ఇదే అని చూపించే ప్రయత్నం చేయగా గత ఆగస్టు 9న 'పాత జనరేటర్‌తో మాయ' అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన నగర మేయర్ సునీల్‌రావు ఇంజినీర్లపై ఆగ్రహించి విచారణకు ఆదేశించారు. నగర పాలక, ప్రజారోగ్యశాఖ ఇంజినీరింగ్ అధికారులు రంగంలోకి వచ్చి వాస్తవ పరిస్థితిని తనిఖీ చేశారు. చివరకు దానిని ఎస్టీపీలో బిగించకుండా వెనక్కి తీసుకెళ్లాలని గుత్తేదారును ఆదేశించారు. కొన్ని నెలల తర్వాత దానిని అక్కడి నుంచి తీసుకెళ్లారు.

బిల్లులో కోత..పాత జనరేటర్ స్థానంలో కొత్త జనరేటర్ బిగించే పరిస్థితి లేకపోవడంతో ప్రస్తుత ధరల ప్రకారం రూ.50 లక్షల మేర బిల్లులో కోత విధిస్తూ ఈఎన్‌సీకి ప్రజారోగ్య శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. తుది బిల్లులో ఈ మొత్తాన్ని తొలగించి ఇచ్చామని ఆ శాఖ ఈఈ సంపత్‌రావు తెలిపారు. నిరంతర విద్యుత్తు సౌకర్యం ఉండటంతో కొత్త జనరేటర్ అవసరం ఉండదని ఆయన చెబుతుండడం కొసమెరుపు.

# ఉన్నత విద్యకు బాసట



భూపాలపల్లి : కార్పొరేట్ కళాశాలలకు దీటుగా సదుపాయాలు.. నిపుణులైన అధ్యాపకుల బోధన.. నాణ్యమైన భోజనం.. వసతి సౌకర్యాలతో గురుకులాలు పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నాయి. ఉచితంగా ఇంటర్, డిగ్రీ విద్యను అందిస్తూ భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకునేలా తోడ్పాటునందిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మహాత్మా జ్యోతిబా ఫులే బీసీ గురుకుల పాఠశాలలు/ కళాశాలల్లో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి తీవ్ర పోటీ నెలకొంది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు పాఠశాల స్థాయి చదువులతో పాటు ఇంటర్, డిగ్రీ విద్యను ఉచితంగా అభ్యసించేందుకు ప్రవేశాలు పొందేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. తాజాగా ఇంటర్, డిగ్రీలో 2023-24 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం ప్రభుత్వం ఇటీవల ప్రకటన జారీ చేసింది. ఈ నెల 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీగా నిర్ణయించారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, జనగామ, హనుమకొండ, వరంగల్ జిల్లాలో మహాత్మా జ్యోతిబా ఫులే బీసీ గురుకుల జూనియర్ కళాశాలలు బాలురకు 17, బాలికలకు 18 వరకు ఉన్నాయి. బాలికలకు 1620, బాలురకు 1420 వరకు సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా రెండు బీసీ డిగ్రీ గురుకుల విద్యాలయాలు, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని పెంబర్తిలో బాలికలకు, పాలకుర్తిలో బాలురకు ఏర్పాటు చేశారు. ఇందులో బాలికలకు 320, బాలికలకు 320 సీట్లు ఖాళీగా ఉన్నాయి. భూపాలపల్లి జిల్లా లింగాల క్రాస్‌రోడ్డు, రేగొండ, మొగుళ్లపల్లి, భూపాలపల్లి బీసీ గురుకుల పాఠశాలలుండగా ప్రభుత్వం కొత్తగా ఈ విద్యా సంవత్సరంలో రేగొండ, భూపాలపల్లిలో బీసీ గురుకుల జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేసింది. ఇందులో వివిధ గ్రూపుల్లో 320 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ములుగు జిల్లాలో ఆరేపెల్లి, మొగుళ్లపల్లి, మంగపేటలో మూడు బీసీ గురుకుల జూనియర్ కళాశాలలున్నాయి. ఇందులో 160 సీట్లు ఉన్నాయి. జనగామ జిల్లాలో కరుణాపురంలో రెండు, పెంబర్తి, జనగాం, రాయపర్తి, మొండ్రాయి పాంత్రంలో మొత్తం ఆరు బీసీ గురుకుల జూనియర్ కళాశాలలున్నాయి. మహబూబాబాద్ జిల్లాలో మరిపెడ, ప్రతిపాకరోడ్, గూడూరు, తొర్రూరు, దంతాలపల్లి, కేసముద్రం మొత్తం ఆరు జూనియర్ కళాశాలలున్నాయి. వరంగల్ జిల్లాలో ఖనాపూర్, గిర్నిబావి, ఓగ్లాపూర్, ఉర్సుగుట్ట, మామునూర్, ఎల్లాపూర్‌లో రెండు, నర్సంపేటలో 8 వరకు ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో శాయంపేట, గుడేప్పాడ్ క్రాస్ రోడ్డు, జయగిరి, ఖాజీపేట, ఉప్పరపల్లి క్రాస్‌రోడ్డు, కమలాపూర్‌లో రెండు, ఎల్లాపూర్‌లో మొత్తం 8 జూనియర్ కళాశాలలున్నాయి.

మెరుగైన విద్య అందిస్తాం

-రాంరెడ్డి, ప్రాంతీయ సమన్వయ అధికారి

మహాత్మా జ్యోతిబా ఫులే గురుకుల ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ఉచితంగా నాణ్యమైన విద్యతో పాటు భోజన వసతి సౌకర్యాలను కల్పిస్తున్నాం. గత విద్యా సంవత్సరంలో వీటిల్లో ఇంటర్ చదివిన విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. జిల్లాలోని అర్హులైన పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులు ఇంటర్, డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు పొంది సద్వినియోగం చేసుకోవాలి.

16 వరకు తుది గడువుమహాత్మాజ్యోతిబా ఫులే బీసీ గురుకుల ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో ఈనెల 16వ తేదీ వరకు దరఖాస్తులకు గడువు ఉంది. ఇందుకోసం రూ.200 రుసుం చెల్లించాలి. ఇదే నెల 29న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. బీసీలకు 70 శాతం, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, ఇతరులకు 30 శాతం సీట్లను కేటాయిస్తారు.

# భక్తుల కానుకలు భద్రమేనా.?



వరంగల్ : ఇటీవల సికింద్రాబాద్ గణపతి దేవాలయంలో భక్తులు సమర్పించిన బంగారు ఆభరణాలకు రసీదు ఇవ్వలేదు. గతంలో ఉజ్జయినీ మహంకాళి ఆలయం, ఇతర ఆలయాల్లోనూ ఈవోలపై కేసులు నమోదయ్యాయి. ఇలాంటి ఘటనలు వరంగల్ ఉమ్మడి జిల్లాలోని కొన్ని ఆలయాల్లోనూ వెలుగు చూశాయి. ఐనవోలు, వరంగల్ బాలానగర శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు సమర్పించిన బంగారు, వెండి వస్తువుల్లో తేడాలొచ్చాయి.

ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా పలు దేవాలయాల్లో బంగారం, వెండి ఆభరణాలకు రసీదులు ఇచ్చే విధానం అమలు కావడం లేదు.. దేవాదాయ శాఖలో ఉద్యోగుల కొరత ఉండడంతో సీనియర్ ఈవోలకు అదనపు ఆలయాల బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో భక్తులు సమర్పించే కానుకల విషయంలో పారదర్శకత ఉండటంలేదనే విమర్శలున్నాయి.

నిబంధనలు ఇవీ..

రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలో పనిచేస్తున్న దేవాలయాల్లో బంగారు, వెండి ఆభరణాలు, ఇతర వస్తువుల నమోదు తప్పనిసరి. ఆలయం పేరుతో రసీదు పుస్తకాలు ముద్రించాలి. భక్తులు ఇచ్చే ప్రతి కానుకకు రసీదు ఇవ్వాలి. ధర్మ కాంటా ఆధారంగా తూకం లెక్కలు రాసి ఇస్తారు. వెంటనే వివరాలు ఇన్వెంటర్ రిజిస్టర్‌లో నమోదు చేయాలి.

10 గ్రాములు దాటే బంగారం, వెండి ఆభరణం, ఇతర వస్తువులకు రసీదు ఇవ్వాల్సిందే. చిన్నవి వస్తే హుండీలో వేయాలి.

రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల్లో బంగారం, వెండి ఆభరణాలు, ఇతర వస్తువులను ప్రతి ఆర్నెల్లకోసారి రాష్ట్ర దేవాదాయ శాఖ తరఫున ఆభరణాల తనిఖీ అధికారి(జ్యువెలరీ వెరిఫికేషన్ ఆఫీసర్- జేవీవో) తనిఖీ చేయాలి. ఇన్వెంటరీ పుస్తకాన్ని పరిశీలిస్తారు.

దేవుళ్ల అలంకరణ కోసం పూజారులకు ఇచ్చే బంగారం, వెండి వస్తువుల వివరాలు ఆలయ అధికారిక పుస్తకంలో నమోదు చేయాలి.

బంగారం, వెండి వస్తువులకు బీమా చేయించాలి. దొంగలు ఎత్తుకెళ్లినప్పుడు ఇది వర్తిస్తుంది.

దేవాలయాల్లో భక్తులు ఎవరైనా బంగారం, వెండి అందజేస్తే రసీదు తీసుకోవాలి. లేకపోతే సిబ్బందిని అడగాలి.

భద్రకాళి ఆలయంలో భద్రంగా..

శ్రీభద్రకాళి దేవాలయంలో భక్తులు సమర్పించే బంగారు, వెండి ఆభరణాలు, ఇతర వస్తువులకు రసీదు ఇస్తారు. జాబితా పుస్తకంలో నమోదు చేస్తారు.

10 గ్రాములు దాటిన ఆభరణాలు, వస్తువులకు రసీదు ఇస్తున్నారు. చిన్న వస్తువులైతే హుండీలో వేయిస్తున్నారు.

ఐదేళ్ల కిందట రాష్ట్ర ప్రభుత్వం బహూకరించిన స్వర్ణ కిరీటం, జటా మకుటాలు హనుమకొండలోని యూనియన్ బ్యాంకు లాకర్‌లో పెట్టారు. ప్రతి ఏడాది శ్రీదేవి శరన్నవరాత్రుల సమయంలో బయటకు తీసేటప్పుడు, తిరిగి లాకర్‌లో పెట్టే ముందు తూకం వేస్తారు.

ఏడాదిలో రెండుసార్లు రాష్ట్ర దేవాదాయ శాఖ జ్యువెలరీ అధికారి పరిశీలన చేస్తారు.

భద్రకాళి దేవస్థానం ఎస్బీఐ గోల్డ్ బాండ్ స్కీంలో చేరింది.

బంగారం, వెండి బ్యాంకులో డిపాజిట్ చేసినందుకు ఏటా వడ్డీ రూపేణా ఆదాయం వస్తుంది.

కొన్ని ఉదాహరణలు

గతేడాది ఆగస్టు, సెప్టెంబరులో హనుమకొండ జిల్లాలోని ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి దేవాలయంలో ఈవో, ఉద్యోగులకు తెలియకుండా ఓ అర్చకుడు బంగారు ఆభరణం చేయిస్తానని భక్తుడి నుంచి నగదు తీసుకున్నారు. ఆభరణం తూకంలో తేడా రావడంతో సదరు భక్తుడు ఫిర్యాదు చేశారు. దేవాదాయ శాఖాధికారులు విచారణ చేసి అర్చకుడిని సస్పెండ్ చేశారు.

వరంగల్ బాలానగర శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో రెండేళ్ల కిందట స్వామి వారికి భక్తుడు సమర్పించిన బంగారం, వెండి వస్తువులు కనిపించ లేదని తెలిసింది. ఇద్దరు ఈవోల మధ్య ఏర్పడిన వివాదం ఇంకా పూర్తవ్వలేదు. వస్తువుల మాయం మిస్టరీ వీడలేదు.

వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలోని పలు దేవాలయాల్లో అనధికారికంగా అర్చకులు భక్తుల నుంచి నగదు తీసుకుంటున్నారు. దేవుడికి నగలు, ఇతర వస్తువుల పేరుతో వసూలు చేసిన సొమ్ము స్వాహా చేస్తున్నారు.

వారాంతపు రద్దీ ఉండే ఆలయాల్లో ఈవోలు, అర్చకులు ఒక్కటై బంగారు, వెండి వస్తువులకు రసీదులు ఇవ్వడం లేదు.

మహబూబాబాద్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ఓ దేవాలయంలో భక్తులు ఇచ్చిన బంగారం, వెండి వస్తువుల వివరాలు సరిగ్గా లేవని తెలిసింది.

భక్తులు రసీదు అడగాలి

– రామల సునీత, సహాయ కమిషనర్, దేవాదాయ శాఖ వరంగల్ ఉమ్మడి జిల్లా

దేవుళ్లకు మొక్కలు చెల్లించేందుకు బంగారం, వెండి ఆభరణాలు, ఇతర వస్తువులు ఇచ్చాక దేవస్థానం సిబ్బందిని రసీదు అడగాలి. అది ఉంటేనే ఆభరణం దేవుడి పేరు మీదు జమ అవుతుంది. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల ప్రకారం దేవాలయాల్లో బంగారు, వెండి వస్తువుల రసీదు పుస్తకాలు ముద్రించాలి. భక్తులు ఇచ్చిన కానుకకు ధర్మ కాంటా వేయించి, తూకం ప్రకారం తగిన రశీదు ఇవ్వాల్సిందే. తర్వాత జాబితా పుస్తకంలో నమోదు చేయాలి. ఈ విధానం ఈవోలందరూ అమలు చేయాలి. లేదంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

# క్రీడా ప్రాంగణాల్లో పరికరాల్లేవ్!

జగిత్యాల :గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలను ఆటల వైపు మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణా లను ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. గ్రామపంచాయతీల్లో స్థల కొరతతో ఊరికి దూరంగా ఏర్పాటు చేశారు. పిల్లలకు ఆడుకునేం దుకు సరైన ఆట వస్తువులు ఏర్పాటు చేయలేదు. కేవలం బోర్డులు ఏర్పాటు చేసి హడావుడిగా ప్రారంభించి తర్వాత పట్టించుకోవడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. కొన్ని చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో, పల్లె ప్రకృతి వనాల్లో, పాఠశాలల్లో ఏర్పాటుచే శారు. ఈ నేపథ్యంలో జిల్లాలో బృందం క్రీడా ప్రాంగణాలను పరిశీలించింది. ఆ వివరాలు..

అలంకారప్రాయమే..

మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామీణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ఒక్కో క్రీడా ప్రాంగణానికి స్థలాన్ని బట్టి రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల ఖర్చుతో నిర్మించారు. యామాపూర్, తిమ్మాపూర్ తండా, వేములకుర్తి గ్రామాల్లో పాఠశాలల ఆవరణలోనే అధికారులు క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. క్రీడా ప్రాంగణాల్లో ఖోఖో, వాలీబాల్, లాంగ్‌జంప్, పుష్‌అప్స్ తీయడానికి స్తంభాలను ఏర్పాటు చేయగా, అవి అలంకార ప్రాయంగానే ఉంటున్నాయి. ఆయా ప్రాంగణాల్లో వాలీబాల్ ఆడడానికి నెట్ అందుబాటులో లేకపోవడంతో పాటు, అన్ని ఆటలు ఆడకపోవడంతో స్తంభాలు నిరుపయోగంగా ఉంటున్నాయనే ప్రజలు వాపోతున్నారు.

అరకొర వసతులు

మల్లాపూర్ మండలంలోని 23 గ్రామపంచాయతీల పరిధిలో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాల్లో సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రాంగణాల్లో సగానికిపైగా ప్రభుత్వ పాఠశాలల్లోనే ఏర్పాటు చేశారు. ఒక్కో ప్రాంగణానికి రూ.4 లక్షల ఈజీఎస్ నిధులను వెచ్చించారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ప్రాంగణాలకు అందుబాటు లో క్రీడా వస్తువులు లేకపోవడంతో ఆటలు ఆడుకునేందుకు ఇబ్బందు లు పడుతున్నారు. పలుచోట్ల షటిల్, వాలీబాల్ నెట్లను కట్టలేదు. ఉదయం, సాయంత్రం క్రీడాకారులు వినియోగించేలా ఆటవస్తువులు ఉంచితే క్రీడాకారులకు సౌకర్యంగా ఉంటుంది. ఈ విషయమై ఈజీఎస్ ఏపీవో సతీష్‌ను సంప్రదించగా ఆటలు ఆడుకునే క్రీడాకారులు పంచా యతీ కార్యాలయానికి వెళ్లి తమకు అవసరమైన క్రీడా వస్తువులను తీసుకోవచ్చని, తిరిగి అప్పగించే బాధ్యత వారిపైనే ఉంటుందన్నారు.

మొక్కుబడిగానే..

మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు మొక్కుబడిగా ఏర్పాటు చేశారు. 23 గ్రామ పంచాయతీల్లో 26 క్రీడా ప్రాంగణాలకు రూ.18.92 లక్షలు వెచ్చించారు. ఒక్కో క్రీడా ప్రాంగణానికి రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేశారు. చాలా వరకు ధాన్యం పోసే స్థలాలు, క్రీడా ప్రాంగణాల స్థలాలు ఒక్కటే కావడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పలు చోట్ల పిచ్చిమొక్కలు, రాళ్లు దర్శనమిచ్చి ఆటలు ఆడుకోవడానికి అనువుగా లేవు. కొంత మొరం పోసి మట్టి చదును చేసి బోర్డులు ఏర్పాటు చేసి ఇనుపరాడ్లు పాతేసి మమ అనిపించారన్న విమర్శలున్నాయి. ఈ విషయమై మెట్‌పల్లి ఎంపీడీవో భీమేష్‌రెడ్డిని సంప్రదించగా, కోతుల బెడదతో యువకులు ఆడుకునేపుడు నెట్లు బిగిస్తున్నారన్నారు. క్రీడా ప్రాంగణాలను ఎప్పటిక పుడు శుభ్రం చేసి ఆటలు ఆడేందుకు అనువుగా ఉండేలా చూస్తున్నామన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో..గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించే ందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న క్రీడా ప్రాంగణాలు కేవలం లక్ష్యం కోసం ఏర్పాటు చేస్తున్నట్లుగా ఉంది. సారంగాపూర్ మండలంలో 18 గ్రామాలు ఉండగా ఇప్పటికే 16 గ్రామాల్లో వీటిని ఏర్పాటు పూర్తి చేయగా, పోచంపేటలో స్థల సమస్యతో పనులు ప్రారంభం కాలేదు. మిగతా భీంరెడ్డిగూడెంలో పరికరాలు బిగించాల్సి ఉంది. స్థల సమస్యతో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, అరకొర వసతుల మధ్య ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు ఒక్కో క్రీడా ప్రాంగణానికి రూ.64 వేల నుంచి రూ.లక్ష వరకు వ్యయం చేస్తున్నారు. ఇందులో క్రీడా ప్రాంగణ బోర్డు, వాలీబాల్ కోర్టు, ఖోఖో, వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేసి వదిలేస్తున్నారు. బీర్‌పూర్ మండలంలో 15 గ్రామాలు ఉండగా అన్ని గ్రామాలతోపాటు మరో నాలుగు అనుబంధ గ్రామాల్లోనూ ఏర్పాటు చేశారు.

90 శాతం పూర్తి...రాయికల్ మండలంలో 32 గ్రామపంచాయతీలు ఉండగా ప్రతి గ్రామానికి క్రీడా ప్రాంగణం మంజూరు చేశారు. ఒక్కో గ్రామంలో సుమారు రూ.4.20 లక్షల నుంచి రూ.7.80 లక్షల వరకు నిధులు ఉపాధి హామీ ద్వారా మంజూరు చేశారు. గ్రామాల్లో 90 శాతం మేరకు మాత్రమే పనులు పూర్తయ్యాయి. అత్యధిక గ్రామాల్లో స్థల కొరతతో క్రీడా ప్రాంగణాల్లో పూర్తిస్థాయి క్రీడా పరికరాలను బిగించలేదు. క్రీడా ప్రాంగణాల్లో భూమిని చదును చేసి సింగిల్ బార్, డబుల్ బార్‌లను మాత్రమే ఏర్పాటు చేశారు. వసతులు లేకుంటే గ్రామస్థులకు వినియోగకరంగా కాకుండా క్రీడా ప్రాంగణాలు అలంకారప్రాయంగా మిగిలే అవకాశం ఉంది.

నిర్వహణ గాలికి..

కోరుట్ల మండలంలో 15 గ్రామాలకు గానూ 14 గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను పూర్తి చేశారు. మాదాపూర్ గ్రామంలో క్రీడా ప్రాంగణ పనులు పూర్తి కావాల్సి ఉంది. గ్రామాల్లో స్థలాల కొరతతో ఇష్టారీతిన క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తున్నారు. స్వాగత తోరణం ఏర్పాటు చేసి వాలీబాల్ కోర్టు కోసం ఇరువైపులా స్తంభాలు, వ్యాయామ బార్లు పాతి నిర్వహణ గాలి కొదిలేశారు. క్రీడా ప్రాంగణ స్థలాన్ని బట్టి ఒక్కో దానికి రూ.1.60 లక్షల నుంచి రూ.6 లక్షల వరకూ బిల్లులు వసూలు చేశారు. నిబంధనల ప్రకారమే బిల్లులు చెల్లించడం జరిగిందని, నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపడతామని ఎంపీవో మమత తెలిపారు.

# కేజీబీవీ విద్యార్థినులకు ఊరట

కరీంనగర్ : గత కొంతకాలంగా కాస్మొటిక్ ఛార్జీల కోసం ఎదురు చూస్తున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కేజీబీవీ విద్యార్థినులకు కొంత ఊరట లభించింది. గతంలో ఆరోగ్య కిట్లను అందించిన ప్రభుత్వం మూడేళ్లుగా వాటిని ఇవ్వడంలేదు. వీటి స్థానంలో ప్రతి నెల డబ్బులు చెల్లిస్తామని ఈ విద్యాసంవత్సరంలో చెప్పినా.. అమలుకు నోచుకోలేదు. విద్యాసంవత్సరం ముగింపు దశలో మూడు నెలల కాస్మొటిక్ ఛార్జీలను మంజూరు చేస్తూ విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.

నెలకు రూ.100 చొప్పున...

ఉమ్మడి జిల్లాలోని 49 కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలున్నాయి. వీటిలో ప్రస్తుతం 10,781 మంది చదువుతున్నారు. నిరుపేదలు, తల్లి, తండ్రిలేని వారు, చదువు మధ్యలో మానేసిన బాలికలు ఉన్న వీటిలో ఉచిత విద్యతోపాటు వసతి, భోజనం తదితర సౌకర్యాలను ప్రభుత్వమే కల్పిస్తోంది. 6-10వ తరగతి వరకు, కొన్నింట్లో ఇంటర్ వరకు విద్య అందిస్తున్నారు. పుస్తకాలు, దుస్తులు, దుప్పట్లు వంటి వాటిని ఉచితంగా సమకూరుస్తున్నారు. గతంలో ప్రతి నెల కాస్మొటిక్ ఛార్జీల కింద నెలకు రూ.100 చొప్పున అందించారు. వాటి స్థానంలో బాలికలకు ఆరోగ్య కిట్ల పేరుతో పలు రకాల వస్తువులను 2019-20 వరకు అందించడంతో వారికి ప్రయోజనంగా నిల్చింది. ఆ తర్వాత వాటిని అందించకపోవడంతో పేద కుటుంబాల బాలికలు సబ్బులు, నూనెలు వంటి వాటిని కొనుక్కునేందుకు ఇబ్బందిపడ్డారు. విద్యాసంవత్సరం ఆరంభంలో ఛార్జీలు చెల్లిస్తామని బ్యాంకు ఖాతాలను సేకరించినా.. డబ్బులు జమ కాలేదు. విద్యాసంవత్సరం ముగింపు దశకు చేరుకున్న క్రమంలో ఒక్కో విద్యార్థినికి నెలకు రూ.100 చొప్పున డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి నెలలకు రూ.300 అందించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. ఉమ్మడి జిల్లాకు రూ.30,13,900 మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# ధాన్యం కొనుగోళ్లు ఎన్నడో?

మోత్కూరు: వరికోతలు ఏప్రిల్ మొదటి వారం నుంచే ముమ్మరంగా సాగుతున్నా నేటికీ ప్రభుత్వరంగ సంస్థలు ధాన్యం కొనుగోలు చేయడం లేదు. ప్రభుత్వం కొనుగోలు చేస్తుందో లేదోన నే అనుమానంతో కోతల ప్రారంభ సమయంలోనే కొందరు రైతులు ధాన్యాన్ని ఆరబెట్టకుండానే ప్రైవేటు వ్యాపారులకు క్వింటా రూ.14 50 నుంచి రూ.1500 చొప్పున విక్రయించారు. రాష్ట్ర ప్రభుత్వమే ధాన్యం కొనుగోలుచేస్తుందని సీఎం కేసీఆర్ ఏప్రిల్ రెండో వారంలో ప్రకటించడంతో కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం ఆరబోశారు. తాలు లేకుండా తూర్పారబట్టి అమ్మకానికి సిద్ధం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలో ప్రజాప్రతినిధులు, అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నారే తప్ప నేటికీ ఒక్క గింజ కొనుగోలు చేయలేదు. ఈ ఏడాది మార్చిలో ఉమ్మడి జిల్లాలో ఐదు కందుల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా ఒక్క మోత్కూరులోనే 787.5 క్వింటాళ్లు కొనుగోలుచేశారు. మిగతా కేంద్రాల్లో కొనుగోళ్లు లేకపోవడంతో, ప్రస్తుతం ధాన్యం పరిస్థితి కూడా అలాగే ఉంటుందా అని రైతులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు.యాదాద్రి జిల్లాలో ఐకేపీ ఆధ్వర్యంలో 95, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 165,మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో 5 చొప్పున మొత్తం 265 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. సుమారు 180 కేంద్రాలు కేంద్రాలు ప్రారంభించారు. ప్రతీ కేంద్రానికి కొన్ని ఖాళీ బస్తాలు పంపారు. నాణ్యతా పరిశీలకులను నియమించారు. కొనుగోలు కేంద్రాలు ధాన్యం పంపాల్సిన మిల్లులను కేటాయించారు. అయినా కొనుగోళ్లు మాత్రం ప్రారంభంకాలేదు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వం 934 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసింది. నల్లగొండ జిల్లాలో మిల్ల ర్లు సన్న రకాలను కొనుగోలుచేస్తుండగా, ప్రభుత్వరంగ సంస్థలు దొడ్డు రకం ధాన్యాన్ని కొనుగోలుచేస్తున్నాయి. అయితే ఐకేపీ కేంద్రాల్లో కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. సూర్యాపేట జిల్లాలో పరిస్థితి కాస్త మెరుగ్గా ఉంది. అయితే ధాన్యం కొనుగోళ్లు ఊపందుకోవాల్సి ఉంది. ఔటన్ నిర్ణయించలేదంటున్న మిల్లర్లుప్రభుత్వానికి మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ (సీఎంఆర్) రైస్ వానాకాలంలో రారైస్ క్విం టాకు 67శాతం, యాసంగిలో బాయిల్డ్ రైస్ 68శాతం, బ్రోకెన్ రైస్(నూకలు) 25శాతం ఇవ్వాల్సి ఉంటుంది. వానాకాలంలో రా రైస్ 60శాతం, నూకలు 40శాతం వస్తాయని, తాము ప్రభుత్వానికి ఏదో రకంగా 67శాతంబియ్యం ఇస్తున్నామని,యాసంగిలో 30 శాతం బియ్యం, 70శాతం నూకలు వస్తాయని మిల్లర్లు చెబుతున్నారు. అలాంటప్పుడు ప్రభుత్వానికి ఎంత బియ్యం ఇవ్వాలో నిర్ణయించకుండా ధాన్యం కొనుగోలు చేయలం టే ఎలా అని రైస్‌మిల్లర్లు ప్రశ్నిస్తున్నారు. అదీగాక తక్కువ సామర్థ్యం ఉన్న మిల్లుల్లో ఇప్పటికే 2021 యాసంగి, వానాకాలం సీజన్ల ధాన్యం బస్తాలు నిల్వ ఉన్నాయని, మళ్లీ ధాన్యం దిగుమతికి స్థలం లేదంటున్నారు. ప్రభుత్వం ప్రాం తానికో కమిటీ ఏర్పాటు చేసి ఔటన్ నిర్ణయిస్తుందని, అయితే ఇప్ప టి వరకు కమిటీ రాలేదని మిల్లర్లు చెబుతున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో బేజారు... ప్రైవేటులో అమ్మకాల జోరుధాన్యంలో తేమ 17శాతం వచ్చేలా ఆరబెట్టి, తాలు లేకుండా ప్యాడీ క్లీనర్లతో శుభ్రం చేసినా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రా రంభం కాకపోవడంతో రైతులు బేజారవుతున్నారు. ప్రైవేట్ వ్యాపారులు కోసిన ధాన్యాన్ని అలానే ఆరబెట్టకుండా, తూర్పారబట్టకుండానే కొనుగోలుచేస్తున్నారు. అయితే ధర తక్కువగా ఇస్తున్నారు. ప్రైవేటు వ్యాపారు లు సీజన్ ప్రారంభంలో క్వింటా రూ.1450 నుంచి రూ.1500ధర చెల్లించారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించగానే ప్రైవేటు వ్యాపారులు ధర పెంచారు. ప్రస్తుతం క్వింటా రూ.1550 నుంచి రూ.1600కు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వెళ్లి రోజుల తరబడి రాశుల కపలా ఉండేబదులు ప్రైవేటు వ్యాపారులకే విక్రయించేందుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. ఒక్క మోత్కూరు మండల కేంద్రం నుంచే ప్రైవేటు వ్యాపారులు రోజూ ఐదారు లారీ లోడ్ల ధాన్యాన్ని ఎగుమతి చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర ఏ–గ్రేడ్ ధాన్యానికి క్వింటా రూ.1960, సాధారణ రకం ధాన్యానికి రూ.1940గా ఉంది. పచ్చి ధాన్యం (ఆరబెట్టని) విక్రయిస్తే అందులో క్వింటాలుకు ఏడెనిమిది కిలోలు తరుగుపోతుంది. వ్యాపారులు కొనుగోలు చేసేప్పుడు క్వింటాకు మూడు కిలోలు కట్ చేస్తున్నారు. వ్యాపారికి (మిల్లర్‌కు) తరుగు వచ్చేది ఐదు కిలోలే. అంటే సుమారు వంద రూపాయలు నష్టం. అయితే ప్రభుత్వ మద్దతు ధర చెల్లించాల్సి లేకపోవడంతో మిల్లర్లకు క్వింటాకు రూ.260 నుంచి రూ.310 వరకు లాభమొస్తోంది. క్వింటాకు రూ.50చొప్పున మధ్య దళారీకి వెళ్లినా ఇంకా రూ.210 నుంచి 260 వరకు లాభమే. దీంతో మిల్లర్లు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలుకు బదులు, ప్రైవేటు వ్యాపారుల నుంచి కొనుగోలుకే మొగ్గుచూపుతున్నారు.

కొనుగోళ్లు ప్రారంభించాలని కోరుతున్న రైతులుప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రోజూ కేంద్రాల్లో పోసిన ధాన్యం రాశుల వద్ద కాపలా ఉండాల్సి వస్తుండటంతో బావుల వద్ద వ్యవసాయ పనులు చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలంలో ఉన్న గడ్డి ఎదిరి వాము వేసుకోవడానికి, పశువులను చూసుకోవడానికి సమయం దొరకడం లేదంటున్నారు.

ధాన్యం పోసి 10 రోజులైంది : మదూరు యాదిరెడ్డి, రైతు, బుజిలాపురంప్రభుత్వం ధాన్యం కొనుగోలుచేస్తుందని ప్రకటించగానే సుమారు 150 బస్తాల ధాన్యం తెచ్చి మోత్కూరు మార్కెట్లో పోశా. మార్కెట్లో కొనుగోలు కేంద్రం ప్రారంభించి 10 రోజులైనా నేటికీ కొనుగోళ్లు చేపట్టలేదు. ఎప్పుడు అడిగినా రేపు, మాపు అంటున్నారు. వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలి.


తాలు పేరు చెప్పి మిల్లర్ల తకరారుమిర్యాలగూడ, ఏప్రిల్ 28: తాలు ఎక్కువగా వస్తుందన్న సాకు తో చింట్లు రకం ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు కొర్రీలు పెడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మిర్యాలగూడ రూరల్ పరిధిలోని ఓ మిల్లులో చింట్లు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని తెలి సి ట్రాక్టర్లు బారులుతీరాయి. సన్నరకాల్లో హెచ్‌ఎంటీల కంటే చింట్ల కు 15 నుంచి 20 రోజుల పంటకాలం ఎక్కువ. దీంతో ఆలస్యంగా కోతకు రావడంతో పెరిగిన ఎండల కారణంగా ధాన్యంలో తాలు శా తం ఎక్కువగా ఉంటోందని మిల్లర్లు వీటి కొనుగోలుకు నిరాకరిస్తున్నారు. కాగా, చింట్లు అతిసన్ననైన బియ్యం కావడంతో మిగతా సన్నాలకంటే ఏటా క్వింటాకు రూ.2000కు పైగానే ధర పలికేది. చీడపీడలతో దిగుబడి తగ్గినా అ?ధిక ధర ద్వారా కొంత నష్టాన్ని పూడ్చుకోవచ్చని రైతులు ఆశించారు. అయితే ధాన్యం కొనుగోలులో ప్రభుత్వాల పేచితో మిల్లర్ల దోపిడీకి అడ్డులేకుండాపోతోంది. ధర తగ్గించి కొనుగోలు చేసేందుకే తాలు ఉ ందనే సాకు చూపుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దోమకాటుకు గురైన వరిచేలలో మాత్రమే 4నుంచి 5శాతం తాలు వస్తుందని, ముందస్తు సస్యరక్షణ చర్యలు చేపట్టి నీరు సమవృద్ధిగా ఉన్న పంట చేలలో నాణ్యమైన ధాన్యం వస్తున్నా ఏ–గ్రేడ్ చింట్ల రకానికి సైతం రూ.1820 నుంచి రూ.1850 ధర మాత్రమే చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిర్యాలగూడ పరిసరాల్లో సుమారు 80రైస్ మిల్లులు ధాన్యం కొనుగోలు చేస్తుండగా, వాటిలో 10 నుంచి 12లోపు మిల్లుల్లో మాత్ర మే చింట్లు కొనుగోలు చేస్తున్నారు.



# లక్ష్యం ఖరారు

జగిత్యాల : జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులకు ఆదాయ లక్ష్యాలు ఖరారు అయ్యాయి. 2022 – 23 ఆర్థిక సంవత్సరానికి గాను మార్కెట్ యార్డుల వారీగా టార్గెట్లను ఉన్నతాధికారులు నిర్ధేశించారు. వ్యవసాయ చట్టాల రద్దు, సొంత కొనుగోళ్ల కేం ద్రాల ఏర్పాటుతో ప్రస్తుత యేడాది మార్కెట్ యార్డులకు పంట ఉత్ప త్తులు పెద్ద ఎత్తున వస్తాయన్న అంచనాతో లక్ష్యం మేర ఆదాయం స మకూరుతుందని సంబంధిత అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. జిల్లాలో పరిస్థితి...జిల్లాలోని పలు ప్రాంతాల్లో 13 వ్యవసాయ మార్కెట్ కమిటీలు, ఒక టి ఉప మార్కెట్ కమిటీలున్నాయి. జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, గొల్లప ల్లి, ధర్మపురి, మల్యాల, కథలాపూర్, మేడిపల్లి, మల్లాపూర్, ఇబ్రహీం పట్నం, పెగడపల్లి, వెల్గటూరు, రాయికల్‌లో వ్యవసాయ మార్కెట్ కమి టీలు పనిచేస్తున్నాయి. వీటితో పాటు జిల్లాలో వెల్గటూరు మండలం చెప్యాల్‌లో ఉప మార్కెట్ కమిటీ పనిచేస్తోంది. వ్యవసాయ మార్కెట్ కమిటీలందు రైతులకు, వర్తకులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించి సేవ లు అందిస్తున్నందుకు గాను ప్రకటిత వ్యవసాయ ఉత్పత్తులపై ఒక శా తం మార్కెట్ ఫీజును కొనుగోలు దారుల నుంచి వసూలు చేస్తున్నారు. జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులలో 29,550 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల 23 గోదాములు ఏర్పాటు చేశారు. నాబార్డు కింద జిల్లా లోని పలు ప్రాంతాల్లో 52,500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల 14 అ దునాతన గోదాములు నిర్మించి రైతులకు సేవలు అందిస్తున్నారు. జగిత్యాల, మెట్‌పల్లి, గొల్లపల్లి మార్కెట్ యార్డులలో జాతీయ వ్యవసాయ మార్కెట్ (ఈ–నామ్) విధానాన్ని అమలు చేస్తున్నారు. రెండేళ్లలో మార్కెట్ ఆదాయం...జిల్లాలోని 13 వ్యవసాయ మార్కెట్ యార్డులలో రెండేళ్లలో లక్ష్యం మే రకు ఆదాయాన్ని సాధించారు. 2020–21 సంవత్సరానికి గానూ జిల్లాలో ని అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీలలో కలిపి రూ. 2722.53 లక్షల మార్కెట్ ఫీజును వసూలు చేశారు. అదేవిధంగా 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీలలో కలిపి రూ. 1,574.74 లక్షల లక్ష్యాన్ని నిర్దేశించగా ఫిబ్రవరి 2022 వరకు రూ. 461.80 లక్షల మార్కెట్ పీజును వసూలు చేశారు. ఆదాయం సమకూరుతుందిలా...మార్కెట్ యార్డులకు రైతులు తీసుకొని వచ్చిన పంట ఉత్పత్తులను వ్యాపారులు కొనుగోలు చేస్తారు. వ్యాపారుల చేపట్టే లావాదేవీల ఆధా రంగా మార్కెట్ యార్డుకు సెస్ చెల్లిస్తారు. మార్కెట్ ఫీజు చెల్లింపు ప్రధాన ఆదాయ వనరుగా ఉంటుంది. దీంతో పాటు పంట ఉత్పత్తుల ను కొనుగోలు చేసే రైస్ మిల్లులు, ఆయిల్ మిల్లులు, జిన్నింగ్ మిల్లులు, ఇతర ఏజెన్సీలు సైతం సెస్ చెల్లించాల్సి ఉంటుంది. పంట ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు తరలించేటప్పుడు చెక్ పోస్టుల వద్ద సంబంధిత యార్డులకు సెస్ చెల్లించాలి. ప్రభుత్వం తరపున ఎఫ్‌సీఐ, సీసీఐ, ఐకేపీ, సింగిల్ విండోలు, మార్క్‌ఫెడ్, నాఫెడ్ తదితర సంస్థలు యార్డులలో పంట ఉత్పత్తులకు మద్దతు ధర చెల్లిస్తూ కొనుగోలు చేస్తుంటాయి. సం బంధిత సంస్థలు సైతం వ్యవసాయ మార్కెట్ కమిటీలకు సెస్ చెల్లిం చాల్సి ఉంటుంది. వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో జరుపుతున్న పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలపై ఫీజును వసూలు చేస్తూ ఆదా యం సమకూర్చుకుంటారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి రూ. 2,152 ఆదాయ లక్ష్యం...జిల్లాలో వివిధ ప్రాంతాల్లో గల 13 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ. 2,152 లక్షల ఆదాయ లక్ష్యా న్ని ఉన్నతాధికారులు నిర్ధేశించారు. ఇందులో జగిత్యాల మార్కెట్ యార్డుకు రూ. 336 లక్షలు, మెట్‌పల్లి రూ. 180 లక్షలు, కోరుట్ల రూ. 156 లక్షలు, గొల్లపల్లి రూ. 149 లక్షలు, ధర్మపురి రూ. 255 లక్షల ఆదాయా న్ని లక్ష్యంగా నిర్ధేశించారు. మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీకి రూ. రూ. 215 లక్షలు, కథలాపూర్ రూ. 133 లక్షలు, మేడిపల్లి రూ. 140 ల క్షలు, మల్లాపూర్ రూ. 107 లక్షలు, ఇబ్రహీంపట్నం రూ. 64 లక్షలు, పె గడపల్లి రూ. 143 లక్షలు, వెల్గటూరు రూ. 170 లక్షలు, రాయికల్ రూ. 104 లక్షల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాలో అత్యధికంగా జగిత్యాల యార్డుకు రూ. 336 లక్షలు నిర్దేశించగా, అత్యల్పంగా ఇబ్రహీం పట్నం యార్డుకు రూ. 64 లక్షల ఆదాయాన్ని టార్గెట్‌గా నిర్ణయించారు. మెట్‌పల్లి పసుపునకు ప్రసిద్ధి..జిల్లాలోని మార్కెట్ యార్డులలో వివిధ పంట ఉత్పత్తులు విక్రయా నికి వస్తుంటాయి. ఇందులో మెట్‌పల్లి మార్కెట్ యార్డు పసుపునకు పేరెన్నిక కలిగింది. అదేవిధంగా జగిత్యాలలో మామిడి, వెల్గటూరులో పత్తి, ఇబ్రహీంపట్నంలో కందులు, వివిధ మార్కెట్ యార్డులలో వరిధాన్యం, మొక్కజొన్న తదితర పంట ఉత్పత్తులు విక్రయానికి వస్తుంటాయి. వీటి క్రయ విక్రయాల ద్వారా మార్కెట్ కమిటీలు ఆదాయాన్ని సాధిస్తుంటాయి. లక్ష్యం మేరకు ఆదాయం సాధిస్తాం– ప్రకాశ్, జిల్లా మార్కెటింగ్ అధికారిజిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ఆదాయాన్ని సాధించడానికి అవసరమైన చర్యలు తీసుకుం టా ము. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గానూ నిర్దేశించిన రూ. 2,152 లక్షల ఆదాయాన్ని రానున్న సంవత్సరంలో సాధించడానికి అవసరమైన కృషి చేస్తాము.

# పంచాయతీలపై విద్యుత్ చార్జీల భారం



నల్లగొండ : అరకొర నిధుల కారణంగా ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న పంచాయతీలు, పురపాలక సంఘాలకు పెరిగిన విద్యుత్ చార్జీలు మరింత భారంగా మారాయి. గత నెలతో పోలిస్తే ఒక్కో పంచాయతీకి అదనంగా రూ.4వేల నుంచి రూ.5వేల వరకు అధికంగా బిల్లు వచ్చింది. పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధులు ట్రాక్టర్ల ఈఎంఐలు, కార్మికుల వేతనాలకే సరిపోతున్నాయి.వీధి దీపాలు, ఇళ్లకు తాగునీటి సరఫరాకు సంబంధించిన విద్యుత్ బిల్లులు పంచాయతీలు చెల్లించాల్సి ఉంటుంది. స్థానిక సంస్థలకు కూడా యూనిట్ చార్జీలు పెంచడంతో ఎక్కువ మొత్తంలో బిల్లు వస్తుండటంతో నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న పంచాయతీలకు వీటి చెల్లింపు ఇబ్బందిగా మారింది. గతంలో వీధి దీపాలు, తాగునీటి సరఫరాకు చెందిన విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లించేది. ఇవి ప్రతీనెల విడుదలకాకపోవడంతో బకాయిలు కోట్ల రూపాయలకు చేరింది. అయితే టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక విద్యుత్ బిల్లులను ప్రతీ నెల పంచాయతీలే చెల్లించాలని ఆదేశాలు జారీచేసింది. అయితే వీధి దీపాల నిర్వహణ సరిగా లేకపోవడంతో బిల్లులు భారీగా వస్తుండటంతో, పంచాయతీలు ఈ భారాన్ని తగ్గించేందుకు ప్రైవేటు సంస్థలతో ఒప్పందం చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీన్ని సర్పంచ్‌లు వ్యతిరేకించడంతో ఎప్పటి మాదిరిగానే పంచాయతీలే వీధి లైట్లకు చెందిన బిల్లులు చెల్లిస్తున్నాయి. కాగా, తాజాగా, యూనిట్ చార్జీలు పెంచడంతో విద్యుత్ బిల్లుల భారం పెరిగింది.

పెరిగిన చార్జీలువీధి దీపాల నిర్వహణకు గతంలో విద్యుత్ యూనిట్ చార్జీ రూ.5గా ఉండేది. కాగా, ప్రభుత్వం దీనికి అదనంగా రూ.1 పెంచడంతో, రూ.6కు చేరింది. నీటి సరఫరా విద్యుత్ కనెక్షన్లకు యూనిట్‌కు రూ.6.10 చార్జి ఉండేది. అది రూ.7.10కి పెరిగింది. దీంతో ఒక్కో పంచాయతీకి నెలసరి బిల్లు అదనంగా రూ.4వేల నుంచి రూ.5వేలు వస్తోంది. మునిసిపాలిటీల్లో పన్నులు, ఇతర మార్గాల్లో ఆదాయం సమకూరుతుండటంతో ఏదో విధంగా నెట్టుకొస్తుండగా, పంచాయతీలు మాత్రం ఆర్థిక భారంతో కొట్టుమిట్టాడుతున్నాయి. దీనికి తోడు మూడు నెలల నుంచి రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు నయాపైసా విడుదల చే యలేదు. ఫలితంగా కొన్ని చోట్ల కార్యదర్శులు అప్పు చేసి విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు. కొన్ని పంచాయతీల్లో ట్రాక్టర్ల వాయిదాలు చెల్లించలేని పరిస్థితి ఉండగా, కార్యదర్శుల ఖా తాలనుంచి బ్యాంకులు దీన్ని మినహాయించుకుంటున్నాయి.కాగా,ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పంచాయతీల విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లించాలని సర్పంచ్‌లు కోరుతున్నారు.

16వేల విద్యుత్ కనెక్షన్లుఉమ్మడి జిల్లాలో 1735 గ్రామపంచాయతీలు ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో 844, సూ ర్యాపేటలో 470, యాదాద్రి జిల్లాలో 421 పంచాయతీలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా మొత్తంగా వీది దీపాలు, తాగునీటి విద్యుత్ కనెక్షన్లు 16వేల పైచిలుకు ఉన్నాయి. వీధి దీపాల కనెక్షన్లు 9,462, తాగునీటికి చెందిన విద్యుత్ కనెక్షన్లు 6,542 ఉన్నాయి. 2019 సెప్టెంబరు నుంచి ఇప్పటి వరకు పంచాయతీల విద్యుత్ బిల్లులు ఉమ్మడి జిల్లాలో రూ.23.74కోట్లు బకాయి ఉంది. పెరిగిన చార్జీలు, ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో ఈ బకాయి మరింతపెరిగే అవకాశం ఉంది.

పెరిగిన చార్జీలతో అధిక భారం : బొల్లెద్దు నాగరాణి, మామిడాల సర్పంచ్, తిప్పర్తి మండలం పెరిగిన విద్యుత్ చార్జీలతో గ్రామ పంచాయతీపై అధిక భారం పడుతోంది. గతంలో సుమారు నెలకు రూ.50వేల నుంచి రూ.55వేల వర కు ప్రతీ నెల బిల్లు వచ్చేది. ప్రస్తుతంగా యూనిట్ రేటు పెరగడంతో సుమా రు రూ.60వేల వరకు బిల్లు వస్తోంది. ఈ ఆర్థిక భారం ఇబ్బందికరంగా ఉంది.

# నెత్తురోడుతున్న జాతీయ రహదారి

మునగాల : అతివేగం, అజాగ్రత్త హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి నిత్యం నెత్తురోడుతోంది. ఈ రహదారిపై గతం కంటే ప్రస్తుత ఏడాది ప్రమాదాలు పెరిగాయి. హైవే నిర్మాణంలో లోపాలు, నిబంధనలు అతిక్రమిస్తున్న వాహనాదారులు, ప్రయాణికులతో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. దీంతో ఇంటి నుంచి బయటికి వెళ్లిన వారు తిరిగి వచ్చే వరకూ కుటుంబ సభ్యుల్లో భయం, ఆందోళన తప్పటం లేదు. జాతీయ రహదారిపై ప్రయాణికులు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. ఏడాదిలో 52 మంది మృతిమునగాల మండలకేంద్రంలో 2021వ సంవత్సరం జనవరి నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 28 వరకు 45 ప్రమాదాలు చోటు చేసుకోగా 52 మంది మృతి చెందగా, 75 మందికి గాయాలయ్యాయి. హైవేపై ఏడు బ్లాక్‌స్పాట్స్‌జిల్లాలోని హైదరాబాద్–విజయవాడ జాతీయ రహహదారిపై తరచుగా ప్రమాదాలు జరుగుతున్న ఏడు ప్రాంతాలను బ్లాక్‌స్పాట్స్‌గా పోలీసయంత్రాంగం గుర్తించింది. కాగా మునగాల మండలం ఆకుపాముల, ముకుందాపురం, మునగాల, తాడ్వాయి, మొద్దులచెర్వు, మాధవరం, కోదాడ మండలం బైపాస్, కట్టకొమ్ముగూడెం స్టేజీ ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌గా (డెంజర్‌గా) పోలీస్ ఉన్నత అధికారులు గుర్తించింది. ఆయా ప్రాంతాల్లో వాహన వేగం తగ్గించేందుకు బారికేడ్లను ఏర్పాటు చేశారు. అయినా ప్రమాదాల సంఖ్య తగ్గటం లేదు.మునగాలలో అసంపూర్తి సర్వీస్



రోడ్డుతో మునగాల మండలకేంద్రంలోని పోలీసస్టేషన్ ఎదురుగా ఉన్న అసంపూర్తి సర్వీసు రోడ్డు ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. ఇక్కడ ఉన్న ఖబరస్తాన్ స్థల వివాదం పరిష్కారానికి నోచుకోకపోవడంతో 150 మీటర్ల సర్వీస్ రోడ్డు నిర్మాణం నిలిచింది. 2009లో రోడ్డు విస్తర్ణకు ఖబరస్తాన్ స్థలం అడ్డంకిగా మారింది. ఆ స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం తమకు అప్పగిస్తే రోడ్డు నిర్మాణం చేపడతామని హైవే నిర్మాణ సంస్థ జీఎంఆర్ ప్రకటించింది. అయితే ఈ స్థలాన్ని ఉన్నతాధికారులు, వక్ఫ్‌బోర్డు అధికారులు పలుమార్లు పరిశీలించారు.కానీ పరిష్కారం చూపలేదు. దీంతో ఈ సర్వీసు రోడ్డుపై నిత్యం ప్రయాణించే వందలాదిమంది తహసీల్దార్ కార్యాలయం, నారాయణగూడెం గ్రామానికి వెళ్లే వారు నేరుగా హైపైకి రావడంతో హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే వాహనాలను ఢీకొని ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమాదాలకు కారణాలు1. అతివేగం, అజాగ్రత్త 2.నిబంధనల ఉల్లంఘన 3.రోడ్లపైకి పశువుల తోలకం4. అండర్‌పాసింగ్‌లు లేకపోవడం 5.యూటర్న్ తీసుకునే వారి నిర్లక్ష్యం 6.మూడు కిలోమీటర్లకు ఒక అండర్‌పాస్ లేకపోవడం

సర్వీస్ రోడ్డు నిర్మాణంతో ప్రమాదాల నివారణమునగాలలో అసంపూర్తి సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపడితే ప్రమాదాలు తగ్గుతాయి. ఎంతోమంది ఆ ప్రాంతంలో ప్రమాదాలకు గురై చనిపోయారు. చాలామంది క్షతగాత్రులయ్యారు. సమస్యకు ఉన్నత అధికారులు పరిష్కారం చూపాలి.– కొప్పుల జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు

# రోగులను పిండేస్తున్న రాకాసులు

భువనగిరి : పట్టణానికి చెందిన ఓ వివాహిత గర్భం దాల్చినప్పటి నుంచి జిల్లా ఆస్పత్రిలోనే నెలసరి వైద్య పరీక్షలు చేయించుంది. ఇటీవల ఆమెకు పురిటి నొప్పులతో జిల్లా ఆస్పత్రికి వెళ్లగా, ఆమెను పరీక్షించి ఉమ్మ నీరు తగ్గింది, కాన్పు కష్టం అవుతుందని, మహిళా వైద్యురాలు భయపెట్టింది. తొలి కాన్పు కావడంతో భయాందోళనకు గురైన ఆమె కుటుంబ సభ్యులు సదరు వైద్యురాలి సొంత ఆస్పత్రిలో చేర్పించగా, సిజేరియన్ చేసింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు. వాస్తవానికి జిల్లా ఆస్పత్రిలో సిజేరియన్ చేసేందుకు పూర్తిస్థాయి సదుపాయాలు ఉన్నా వైద్యురాలు ఆ గర్భిణిని భయపెట్టి సొంత ఆస్పత్రికి వెళ్లేలాచేసి సీజేరియన్ పేరుతో రూ.35వేలు బిల్లు వసూలు చేసింది. అసలు సిజేరియన్ అవసరం లేదని ఆమెను పరీక్షించిన బృందంలోని ఓ నర్సు చెప్పగా, ఆ వైద్యురాలు బెదిరింపులకు పాల్పడినట్లు తెలిసింది. సదరు మహిళ గర్భిణిగా ఉన్నప్పుడు 7వ నెలలో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించుకోగా, సాధారణ కాన్పే అవుతుందని అక్కడి వైద్యులు తెలిపారు. వైద్యుల కాసుల కక్కుర్తి కారణంగా సిజేరియన్ ప్రసవాల్లో యాదాద్రి జిల్లా రాష్ట్రంలో అగ్రగామిగా నిలిచింది. భువనగిరి టౌన్: భువనగిరి జిల్లా ఆస్పత్రి వ్యాపార వలయంలో చిక్కుకుంది. కాన్పులు, వైద్య చికిత్సల కోసం వస్తున్న రోగుల అవసరం, భయాన్ని ఆసరా చేసుకొని ఆస్పత్రిచుట్టూ ఉన్న ప్రైవేట్ ల్యాబ్‌లు, ప్రైవేట్ ఆస్పత్రులు సొమ్ము చేసుకుంటున్నాయి. వాటికి జిల్లా ఆస్పత్రి వైద్యులు, సిబ్బందే సహకారం అందిస్తుండటంతో రోగులపై ఆర్థికభారం పడుతోంది.

జిల్లాల పునర్విభజన అనంతరం ఏరియా ఆస్పత్రిగా ఉన్న భువనగిరి ఆస్పత్రిని జిల్లాస్థాయి ఆస్పత్రి గా అప్‌గ్రేడ్ చేశారు. దీంతో ఇక్కడికి వచ్చే రోగుల సం ఖ్య కూడా పెరిగింది. అయితే అందుకు అనుగుణంగా వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించకపోగా, వసతులు కూడా సమకూర్చలేదు. దీన్ని అదనుగా చేసుకొని జిల్లా ఆస్పత్రి చుట్టూ 15 వరకు ప్రైవేట్ ల్యాబ్‌లు, 10 వరకు ఆస్పత్రులు వెలశాయి. ఈ ప్రైవేటు ఆస్పత్రుల్లో జిల్లా ఆస్పత్రి వైద్యులే వైద్య సేవలు అందిస్తుండగా, దీనికి కిందిస్థాయి సిబ్బంది ప్రోత్సాహం అం దిస్తున్నారు. ఈ నేపథ్యంలో వచ్చిన ఫిర్యాదుల మేరకు రాష్ట్ర వైద్య, కుటుంబ సంక్షేమశా ఖ విచారణ నిర్వహించి ప్రభుత్వ ఆస్పత్రికి చెం దిన 9మంది వైద్యులు, 30 మంది నర్సులు, సిబ్బందికి వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు డీసీహెచ్‌ఎస ఇటీవల షోకాజు నోటీసులు జారీ చేశారు. అం తేగాక సాయి తేజ నర్సింగ్‌హోం, సాయి తేజ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ఈ నెల 24న సీజ్ చేశారు. వాటి నిర్వాహకులైన ఎస్.నరేషపై కేసు నమోదు చేశారు. అయినా దోపిడీ ఆగలేదు. ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లకు సహకరిస్తున్న జిల్లా ఆస్పత్రి వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాలు కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు కూడా చేశాయి. సూదిమందుకు డబ్బులు ఇవ్వాల్సిందేసూర్యాపేట సిటీ: సూర్యాపేట జనరల్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న రోగులకు సూది వేసేందుకు సైతం సిబ్బంది డబ్బు వసూలుచేస్తున్నారని బాధితుల కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. జనరల్ ఆస్పత్రిలో వార్డుల వారీగా విభజించుకొని మరీ వసూళ్లకు తెగబడుతున్నారు. ఒక్క సూదిమందు వేసేందుకు రోజుకు రూ. 50నుంచి రూ.100 వరకు వసూలు చేస్తున్నట్టు తెలిసింది.పైసలివ్వనిదే వైద్యం కరువుభువనగిరి జిల్లా ఆస్పత్రికి ప్రసూతితో పాటు పలు వైద్య చికిత్సలు, వైద్య నిర్ధారణ పరీక్షల కోసం వస్తున్న రోగుల నుంచి వైద్యులతో పాటు సిబ్బంది అక్రమంగా వ సూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రసూతి శస్త్ర చికిత్సల కోసం నర్సులు, పైస్థాయి వారు వసూలు చేస్తుండగా డిశ్చా ర్జి సమయంలో స్వీపర్లు, సెక్యూరిటీ గార్డులు బత్తా పేరు తో ఒక్కొక్కరి నుంచి రూ.1000కిపైగా వసూలు చేస్తున్నారు. అలాగే అత్యవసర చికిత్సల నిమిత్తం హైదరాబాద్ ఆస్పత్రులకు తరలించాల్సి వస్తే అంబులెన్స్ డ్రైవర్లు సిండికేట్‌గా మారి రోగుల నుంచి అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారు. ఈ నెల 25 రాత్రి స్థానిక అర్బన్ కాలనీకి చెందిన ఒక మహిళకు గుండెపోటు రావడంతో ఆమెను జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిందని వైద్యులు నిర్ధారించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. అనంతరం మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లగా, ఆమె మెడలోని రూ.50వేల విలువైన తులం బంగారు ఆభరణాలు కనిపించలేదు.



# మహాత్మా జ్యోతిరావు పూలేకు సీఎం జగన్ నివాళి

తాడేపల్లి: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులర్పించారు.

కార్యక్రమంలో బీసీ సంక్షేమం, ఐ అండ్ పీఆర్ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి పాల్గొన్నారు. అణగారిన వర్గాల కోసం జీవితాన్ని ధారబోసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని సీఎం జగన్ అన్నారు.

“ఆధునిక భారతదేశంలో సామాజిక న్యాయం, మహిళా సాధికారత ఉద్యమాలకు ఆద్యుడు. చదువులతోనే సమన్యాయం, అభివృద్ధి సాధ్యమని నమ్మిన మహాత్ముడు.

ఆయన మార్గంలోనే మా పయనం. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా నివాళులు” అంటూ సీఎం ట్వీట్ చేశారు.

# నేడు సీఎం వైయస్ జగన్ ప్రకాశం జిల్లా మార్కాపురం పర్యటన



తాడేపల్లి: ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి రేపు (12.04.2023) ప్రకాశం జిల్లా మార్కాపురంలో పర్యటించనున్నారు. వైయస్‌ఆర్ ఈబీసీ నేస్తం లబ్ధిదారుల ఖాతాల్లో సీఎం వైయస్ జగన్ బుధవారం నగదు జమ చేయనున్నారు.

రేపు ఉదయం 9 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి సీఎం వైయస్ జగన్ బయలుదేరి 9.55 గంటలకు మార్కాపురం చేరుకుంటారు. 10.15 - 12.05 గంటలకు ఎస్‌వీకేపీ డిగ్రీ కాలేజ్ గ్రౌండ్స్‌లో బహిరంగ సభా వేదిక వద్ద వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు. బహిరంగ సభలో ప్రసంగం, అనంతరం ఈబీసీ నేస్తం లబ్ధిదారులకు నగదు జమచేయనున్న సీఎం, కార్యక్రమం అనంతరం 12.40 గంటలకు అక్కడినుంచి బయలుదేరి 1.35 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

# రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దన్న డీఎస్పీ.. లోకేష్ సమాధానం ఏంటో తెలుసా?

తాడిపత్రి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ఈరోజు తాడిపత్రి నియోజకవర్గంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా యువనేతకు టీడీపీ నేతలు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం పాదయాత్ర చేస్తున్న లోకేష్‌ను తాడిపత్రి డీఎస్పీ చైతన్య కలిశారు. ఫ్యాక్షన్ నియోజకవర్గం కావడంతో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దంటూ లోకేష్‌కు డీఎస్పీ సూచించారు. దీంతో డీఎస్పీకి లోకేస్ అదిపోయే సమాధానం చెప్పారు. “గత 67 రోజులుగా నేను పాదయాత్ర చేస్తున్నా.... ఎక్కడ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం లేదని” డీఎస్పీకి స్పష్టం చేశారు. ప్రభుత్వ అవినీతిని.. ఎమ్మెల్యే అవినీతిని కచ్చితంగా తాను ఎండగడతానని తెలిపారు. ఈ క్రమంలో నోటీసులు తీసుకోవాలని డీఎస్పీ కోరగా.. అందుకు లోకేష్ నిరాకరించారు. దీంతో చేసేదేమీ లేక పాదయాత్ర ఆర్గనైజర్స్‌కు డీఎస్పీ నోటీసులు ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈరోజు ఉదయం ఉలికుంటపల్లి విడిది కేంద్రం నుంచి 67వ రోజు పాదయాత్రను యువనేత ప్రారంభించారు. నేటితో శింగనమల నియోజకవర్గంలో పాదయాత్ర పూర్తి అయ్యింది. తాడిపత్రి నియోజకవర్గంలోకి ప్రవేశించిన యువగళం పాదయాత్ర ప్రవేశించింది. ఈ క్రమంలో లోకేష్‌కు టీడీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. జేసీ ప్రభాకర్ రెడ్డి, జేసీ దివాకర్ రెడ్డి, జేసీ అస్మిత్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తాడిపత్రికి చేరుకుని లోకేష్‌కు పూలమాలతో స్వాగతం



పలికారు. అంతకుముందు ఉలికుంటపల్లి విడిది కేంద్రం వద్ద మహనీయుడు జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి లోకేష్, టీడీపీ ముఖ్య నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. అణగారినవర్గాల ఆశాజ్యోతి, సామాజిక తత్త్వవేత్త, సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతిలో నివాళులు అర్పిస్తున్నట్లు లోకేష్ తెలిపారు. మహిళలు, అట్టడుగువర్గాల ఆత్మగౌరవ పోరాటానికి విద్యనే ఆయుధంగా అందించిన పూలే మహాశయుని ఆశయసాధనకి కృషి చేయడం మనందరి బాధ్యత. జై పూలే అంటూ లోకేష్ నివాళి అర్పించారు. మరోవైపు యువగళంకు సంఘీభావంగా మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పాదయాత్రలో పాల్గొన్నారు.

# జగనన్నే మా భవిష్యత్ అని ప్రజలు బలంగా చెప్తున్నారు : మంత్రి రోజా

విజయవాడ: జగనన్నే మా భవిష్యత్ అని ప్రజలు బలంగా చెప్తున్నారని మంత్రి రోజా అన్నారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ, జనసేనకి దమ్ముంటే ఇంటింటికి వెళ్లి ఏం చేశారో చెప్పగలరా? అని ప్రశ్నించారు.

రాష్ట్రానికి పట్టిన దరిద్రం, సైతాన్ చంద్రబాబే. ఓటుకు నోటు కోసం రాష్ట్రాన్ని, రూ.1.50 లక్షల కోట్ల ఆస్తులను నాశనం చేశాడని మంత్రి దుయ్యబట్టారు. “చంద్రబాబు గత ఐదేళ్లలో ఏం చేశాడో జనంలోకి వెళ్లి చెప్పే ధైర్యముందా?. దేశంలోనే ఏ సీఎం చేయలేని విధంగా జగనన్న ప్రజాసర్వే చేస్తున్నారు. కుప్పంలో కూడా చంద్రబాబుకు ఓటమి తప్పదు” అని మంత్రి రోజా అన్నారు.



# పూలే ఆలోచన విధానాలను కొనసాగిస్తున్న సీఎం వైయస్ జగన్



గుంటూరు: సమాజ శ్రేయస్సును కోరిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మా జ్యోతి రావు పూలే అనిసమాజ శ్రేయస్సును కోరిన గొప్ప సంఘసంస్కర్త పూలే అని వైయస్‌ఆర్‌సీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కె) కొనియాడారు. పూలే ఆశయాలు, ఆలోచన విధానాల కొనసాగింపులో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి గారితో పాటు ప్రస్తుత ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. మంగళగిరి ఆటోనగర్లోని ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో మంగళవారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ.. దశాబ్దాల క్రితమే భారతదేశం అభివృద్ధిని కాంక్షించిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే అని తెలిపారు. సమాజంలో కులాలు, మతాలు వర్గాల యొక్క హెచ్చుతగ్గుల నిర్మూలన కేవలం చదువు వల్ల మాత్రమే సాధ్యమని గ్రహించి భారత దేశ విద్య ప్రదాతగా జ్యోతిరావు పూలే నిలిచారన్నారు. ఆయన వారసుడిగా భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు చరిత్ర పుటల్లో నిలిచిపోయిందన్నారు.

# సీఎం జగన్ ఉద్యోగులను నమ్మించి మోసం చేశారు...




గుంటూరు జిల్లా: నాలుగేళ్ల వైకాపా పాలన రాష్ట్రానికి శాపమని, రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నమ్మక ద్రోహం చేశారని టీడీపీ నేత, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ “సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పి ఉద్యోగులను నమ్మించి మోసం చేయలేదా?.. మద్యపాన నిషేధం హామీ విస్మరించటం ద్రోహం కాదా?.. 25 మంది ఎంపీలను గెలిపిస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తానని చెప్పి చేసింది ద్రోహం కాదా?.. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయకపోవడం నమ్మక ద్రోహం కాదా?.. పోలీసులను సొంత కార్యకర్తల మాదిరిగా వాడుతూ, ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెట్టింది నిజం కాదా?” అని ప్రశ్నించారు. కనీసం నాసిరకం విత్తనాలపై రైతులు ఫిర్యాదు చేసే పరిస్థితి లేదని కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. రాష్ట్రంలో యథేచ్ఛగా భూ కబ్జాలు, ప్రజల ధన మాన ప్రాణాలకు రక్షణ లేకుండా చేసి సీఎం జగన్ ద్రోహం చేశారని విమర్శించారు. రాష్ట్రాన్ని గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చి.. ఏపీ పరువు తీశారన్నారు. జగన్ రెడ్డి అడుగడుగునా రాష్ట్ర ప్రజలకు నమ్మక ద్రోహం చేశారన్నారు. నాలుగేళ్ళల్లో రాష్ట్రంలో ఒక్క రోడ్డు కూడా వేయలేదని విమర్శించారు. కేసులకు రాజీపడి ప్రత్యేక హోదా తేలేకపోయారని ఎద్దేవా చేశారు. జనవరిలో జాబ్ క్యాలెండర్ అని చెప్పి నిరుద్యోగ యువతను మోసం చేయలేదా? అని ప్రశ్నించారు. నాలుగేళ్లలో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కు పోయిందని కన్నా లక్ష్మీనారాయణ వ్యాఖ్యానించారు.




సింధనూరు : కాంగ్రెస్ టికెట్ ఎవరిదా..అనే అంశం సింధనూరులో అటు పార్టీ శ్రేణుల్లో ఇటు ప్రజల్లో నరాలు తెగేటంత ఉత్కంఠను రేకెత్తిసోంది. దీనికోసం మాజీ ఎమ్మెల్యే బాదర్లి హంపనగౌడ..ఆయన మనవడైన పీసీసీ ప్రధాన కార్యదర్శి బసనగౌడ బాదర్లి దిల్లీలో మకాం పెట్టి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తూ..అంతిమ దశకు చేరుకున్నారు. ఇక ఈరోజో..రేపో టికెట్ ఎవరికి దక్కుతుందో అనే చిక్కుముడి విడిపోనుంది. ప్రజల్ని తొలిచేస్తున్న సందేహం మాత్రం ఇందులో టికెట్ దక్కని వారు..ఏం చేస్తారా..అనేదే ప్రశ్నార్థకంగా మారింది. నాలుగు రోజుల క్రితం రెండు శిబిరాలు టికెట్ తమదే..అంటూ గాంభీర్యాన్ని ప్రదర్శించాయి. రాను..రాను సమస్య జటిలం అవుతున్నందున..కొత్త ఆలోచనలు మొదలయ్యాయి. నామపత్రాల సమర్పణ తేదీ కూడా దగ్గర పడుతున్నందున..టికెట్ దక్కకుంటే ఏం చేసేదనే ప్రశ్న ద్వితీయశ్రేణి నాయకుల్లో ఉత్కంఠను పెంచుతోంది. టికెట్ ప్రయత్నంలో భాగంగా హంపనగౌడ, బసనగౌడ ఇద్దరూ నాలుగు రోజులుగా దేశ రాజధానిలోనే ఉండి పోయారు. కె.కరియప్ప భాజపాలో చేరడంతో మరోవైపు పేరొందిన ఇతర పార్టీల ద్వారాలు దాదాపు మూసుకుపోయాయి.

హంపనగౌడ, బసనగౌడ ఇద్దరిలో ఒకరు ఈ వారంలో టికెట్ విజేత అయిపోతారు. టికెట్ దక్కని నాయకుడు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తారా..లేదా అనే దానిపై ఇరువర్గాల్లో మల్లగుల్లాలు పడగా ఇరువైపులా తాము సిద్ధమే అన్న సంకేతాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో తాత-మనవడులో స్వతంత్ర అభ్యర్థి ఎవరవుతారా..అని జనం ఉత్సుకతతో ఎదురు చూస్తున్నారు. దిల్లీలో ఉన్న ఇద్దరూ సింధనూరు చేరుకోగానే..దీనిపై నిర్ణయం జరుగుతుంది.




వాషింగ్టన్: భారత్‌లో ముస్లిం మైనార్టీలపై హింస జరుగుతోందంటూ పశ్చిమ దేశాల్లో వస్తున్న వార్తలను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తీవ్రంగా ఖండించారు. ప్రపంచంలోనే అత్యధిక ముస్లిం జనాభా ఉన్న రెండో దేశం భారత్ అని ఆమె తెలిపారు. ఇస్లామిక్ దేశమైన పాకిస్థాన్ కంటే భారత్‌లోనే ముస్లిం ప్రజల జీవనం మెరుగ్గా ఉందన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న నిర్మలా సీతారామన్.. వాషింగ్టన్‌లో పీటర్సన్ ఇన్స్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ ఎకానమిక్స్‌లో జరిగిన చర్చా వేదికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత్‌లో ముస్లిం మైనార్టీలపై హింస, ప్రతిపక్ష ఎంపీలపై అనర్హత వంటి అంశాలపై పలువురు ఆమెను ప్రశ్నించారు. దీనికి సీతారామన్ గట్టి కౌంటర్ ఇచ్చారు. “ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ముస్లిం జనాభా ఉన్న దేశం భారత్. వారి సంఖ్య పెరుగుతోంది కూడా. వారి జీవితాలు కష్టంగా ఉంటే.. ప్రభుత్వం నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటుంటే 1947 నాటి కంటే వారి జనాభా ఇంత పెరగగలదా?ఆనాడు ఇస్లామిక్ దేశంగా ఏర్పడిన పాకిస్థాన్‌లో ప్రస్తుతం మైనార్టీల పరిస్థితి దారుణంగా ఉంది. అక్కడ వారి సంఖ్య నానాటికీ పడిపోతోంది. కానీ, మా దేశంలో ఆ పరిస్థితి లేదు. మా దగ్గర శాంతి భద్రతలనేది దేశం మొత్తానికి సంబంధించిన అంశం. భారత్‌లో ముస్లింలపై దాడులు జరుగుతున్నాయన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవం. వాస్తవ పరిస్థితులు ఏమాత్రం తెలుసుకోకుండా ఇలా దేశాన్ని నిందించడం సరికాదు” అని ఆమె మండిపడ్డారు. భారత్‌లో ఉన్న ముస్లింలు.. పాకిస్థాన్ ప్రజల కంటే మెరుగ్గా జీవిస్తున్నారని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. ఇలాంటి వార్తలు రాసిన వారు భారత్‌కు రావాలని నిర్మలమ్మ ఆహ్వానించారు. దేశమంతా ఒంటరిగా తిరిగి తమ ఆరోపణలను రుజువు చేయాలని సవాల్ విసిరారు.




ఇటీవల అమెరికా గగనతలంపై కలకలం రేపిన చైనా నిఘా బెలూన్‌ను కూల్చివేసిన విషయం తెలిసిందే. ఈ పరేషన్‌కు సంబంధించిన సున్నితమైన వివరాలను అమెరికా అధికారులు భారత్ సహా మరికొన్ని మిత్రదేశాలతో పంచుకొన్నారు. భారత్-అమెరికా వాయు సేనలు సంయుక్తంగా నిన్న ‘ఎక్స్‌కోప్‌ఇండియా 23’ పేరిట వాయుసేన విన్యాసాలు ప్రారంభించాయి. ఈ సందర్భంగా భారత వాయుసేన చీఫ్ వీఆర్ చౌద్రీ, అమెరికాకు చెందిన పసిఫిక్ ఎయిర్‌ఫోర్స్ కమాండర్ కెన్నిత్ విల్స్‌బాష్ న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. పరస్పర ప్రయోజనాలున్న అంశాలపై సహకారానికి సంబంధించి చర్చించుకొన్నారు. ఈ సందర్భంగా కెన్నిత్ విలేకర్లతో మాట్లాడుతూ చైనా బెలూన్ కూల్చివేత ఆపరేషన్ వివరాలను భారత్ సహా కొన్ని వాయుసేనలతో పంచుకొన్నట్లు పేర్కొన్నారు. ‘అమెరికాలో చోటు చేసుకొన్న పరిణామాలపై ఈ ప్రాంతంలోని ఎయిర్ చీఫ్స్‌తో సంక్షిప్తంగా చర్చించాం. చైనా బెలూన్‌ను కూల్చివేసే సమయంలో ఎటువంటి అంశాలను పరిగణనలోకి తీసుకొన్నాం.. అది ఎటువంటి సవాళ్లను మాకు విసిరింది.. ఒక వేళ దానిలో మనుషులు ఉంటే ఏం చేయాలనుకొన్నాం.. వంటి అంశాలపై సమాచారం ఇచ్చాం’ అని వెల్లడించారు. గత డిసెంబర్‌లో భారత్‌లోని అండమాన్ ప్రాంతంలో త్రివిధ దళాల యుద్ధ విన్యాసాల సమయంలో కూడా ఓ నిఘా బెలూన్‌ను గుర్తించిన విషయం తెలిసిందే. ఈ యుద్ధ విన్యాసాలు పశ్చిమబెంగాల్‌లోని పానాగఢ్, కలాయ్‌కుండా, ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో జరుగుతున్నాయి. తొలిసారిగా అమెరికాకు చెందిన రెండు బీ1 లాన్సర్ బాంబర్లు ఇందులో పాల్గొననున్నాయి. ఇవి ఏప్రిల్ 13న భారత భూభాగంపై ల్యాండ్ కానున్నాయి. ఇక ఇప్పటికే అమెరికా వాయుసేనకు చెందిన ఎఫ్-15 ఫైటర్ జెట్‌లు, సీ17, సీ130జే విమానాలు భారత్ చేరుకొన్నాయి. ఇరు దేశాల మధ్య సమన్వయం పెంచడానికి ఈ విన్యాసాలు ఉపయోగపడతాయని జనరల్ కెన్నిత్ పేర్కొన్నారు. భారత్-అమెరికా మధ్య బలపడిన సైనిక సహకారాన్ని ఈ పరిణామాలు సూచిస్తున్నాయి. తైవాన్-చైనా మధ్య ఉద్రిక్తత నెలకొన్న సమయంలో ఈ విన్యాసాలు మొదలు కావడం గమనార్హం.

# ‘కోడికత్తి బాధితుడికి ఎప్పుడు విముక్తి జగన్?’



అమరావతి: కోడికత్తి కేసు బాధితుడైన దళితబిడ్డ శ్రీనివాస్‌కు జగన్ ఎప్పుడు విముక్తి కల్పిస్తారని మాజీమంత్రి కే.ఎస్.జవహర్ ప్రశ్నించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... అంబేద్కర్ మహనీయుడు చెప్పినట్టు జగన్ పులుల్ని వదిలేసి మేకల్ని బలి తీసుకుంటున్నారని విమర్శించారు. తాను కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకుంటూ విచారణలో జాప్యానికి జగనే కారణమవుతున్నారని అన్నారు. కోడికత్తి ఘటనలో కుట్రకోణంపై విచారణ జరపాలంటూ జగన్ ఇప్పుడు చిలుకపలుకులు పలుకుతున్నారని ఆయన మండిపడ్డారు. నాలుగేళ్ల నుంచి సెంట్రల్ జైల్లో శ్రీనివాస్ మగ్గిపోతున్నా, అతని తల్లిదండ్రులు కన్నీటితో విలపిస్తున్నా జగన్‌లో చలనంలేదన్నారు. శ్రీనివాస్ తల్లిదండ్రుల ముఖం చూసి, వారికి ధైర్యం చెప్పడానికి కూడా వైసీపీ అధినేతకు మనసురాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత బిడ్డల్ని తనస్వార్థ రాజకీయాలకు బలిచేస్తున్న జగన్ వారికి మేనమామ అవుతాడా? అని ప్రశ్నించారు. గతఎన్నికల్లో లబ్ధిపొందానికి కోడికత్తి డ్రామా, బాబాయ్‌పై గొడ్డలివేటు నాటకాలు ఆడిన జగన్ ఈ ఎన్నికల్లో లబ్ధికోసం ఎలాంటి కొత్తనాటకాలు ఆడుతున్నాడో చెప్పాలన్నారు. కోడికత్తి శ్రీనివాస్ కుటుంబాన్ని జగన్ వెంటనే ఆదుకోకుంటే దళితుల ఆగ్రహానికి బలికాక తప్పదని జవహర్ హెచ్చరించారు.

# ప్రధాని మోదీ చేతిలో వాళ్లు కీలు బొమ్మలు...

పల్నాడు జిల్లా: ఏపీ ప్రత్యేక హోదాకు కేంద్రం పంగనామాలు పెట్టిందని, రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల ప్రత్యేక ప్యాకేజీకి తిలోదకాలిచ్చిందని మాజీ రాజ్యసభ సభ్యుడు ఏన్ తులసిరెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ బీజేపీ ఏపీ రాష్ట్రానికి తీరని ద్రోహం, అన్యాయం చేసిందన్నారు. కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్‌కు స్వస్తి పలికి, పోలవరం ప్రాజెక్టును బీజేపీ ప్రభుత్వం ప్రశ్నార్ధకం చేసిందని, దేశాన్ని అప్పుల భారత్ చేసిందని దుయ్యబట్టారు. దేశాన్ని ఇద్దరు గుజరాతీలు అమ్మేశారని.. ఇద్దరు గుజరాతీలు కొనేశారని తులసిరెడ్డి అన్నారు. బీజేపీ పాలనలో దేశానికి అచ్చే దిన్‌కు బదులుగా చచ్చే దిన్ దాపురించిందన్నారు. నరేంద్ర మోడీ చేతిలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, జగన్మోహన్ రెడ్డి కీలు బొమ్మలుగా మారారన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అరు సూత్రాలు




అమలు చేసి అభివృధి చేస్తుందన్నారు. జగన్ ప్రభుత్వం లో రైతులు, మహిళలు, నిరుద్యోగులు, కాంట్రాక్టర్లు, సర్పంచులు రగిలి పోతున్నారని.. ‘జగన్ మా దరిద్రం.. జగన్ మా శని’ అని ప్రజలు అంటున్నారన్నారని తులసిరెడ్డి వ్యాఖ్యానించారు.

## బులుగు చీరలోన హనీరోజ్ సిగ్గుల మొగ్గాయెను

బులుగు చీరలో సిగ్గులొలకబోస్తోంది. నునులేత పాల బుగ్గలు ఓ ముద్దిమ్మని కవ్విస్తున్నాయ్. కొంటెగా అలా ఓర చూపు చూస్తూ గుండెల్ని గిల్లేస్తోంది.. ఇంతకీ ఎవరీ నవయవ్వన జవ్వని? .. బాలకృష్ణ మాస్ ఫ్యాన్స్ కి పెద్దగా పరిచయం చేయాల్సిన అవసరం లేని పేరు ఇది. హనీ ఈజ్ ది బెస్ట్ అని అనాలా.. హనీ రోజ్ అని పిలవాలా మీరే నిర్ణయించండి. ఈ మల్లూ బ్యూటీ ఏ ముహూర్తాన మాస్ హీరో బాలకృష్ణ సరసన నటించిందో కానీ క్రేజ్ అమాంతం స్కైని టచ్ చేసింది. ప్రస్తుతం హనీ మూడ్ లో యావత్ ప్రపంచం ఊగిసలాడుతోంది. వీరసింహారెడ్డి రిలీజ్ తర్వాత ఒక్కసారిగా ఈ బ్యూటీ పేరు లైమ్ లైట్ లోకి వచ్చింది. అంతకుముందు తెలుగులో నటించినా కానీ ఈ అమ్మడికి ఏమంత క్రేజ్ రాలేదు. కానీ ఇటీవల తనకు దక్కిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని టాలీవుడ్ లో



క్రేజీ బ్యూటీగా వెలిగిపోతోంది. ఇప్పుడు ఇరు తెలుగు రాష్ట్రాల్లో షాపుల ఓపెనింగలు రిబ్బను కటింగులు అంటూ బాగానే సైడ్ ఇన్ కం ఆర్జిస్తోంది. ఇటీవల ఓ షాప్ ఓపెనింగుకి వెళ్లిన హనీరోజ్ ని భారీ మాస్ ఫ్యాన్స్ రౌండప్ చేసిన సంగతి తెలిసిందే. దీనిని బట్టి తనకు ఎలాంటి క్రేజ్ ఉందో అర్థం చేసుకోవాలి. ప్రస్తుతం హనీరోజ్ నెక్ట్స్ ఏంటి? అంటూ అంతా ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు. కానీ ఇంతవరకూ తన నుంచి ఘనమైన ప్రకటన ఒక్కటీ రాలేదు. కానీ వరుసగా స్క్రిప్టులు వినే పనిలో హనీ బిజీగా ఉందని మాత్రం తెలిసింది. ఇటీవలి కాలంలో సీనియర్ హీరోలకు కథానాయికల కొరత ఉంది. దీనిని ఈ భామ ఎలా ఎన్ క్యాష్ (సద్వినియోగం) చేసుకుంటుందో వేచి చూడాలి. ప్రస్తుతానికి ఒక్కో షాప్ ఓపెనింగుకు 8లక్షల నుంచి 10లక్షలు కోట్ చేస్తూ నాలుగు చేతులా ఆర్జిస్తోందని సమాచారం. అలాగే హనీరోజ్ బ్లూ శారీలో హొయలొలికించిన తాజా ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. 2005లో మలయాళంలో విడుదలైన బాయ్ ఫ్రెండ్ చిత్రంతో మాలీవుడ్ లో అడుగుపెట్టిన ఈ బ్యూటీ కన్నడ- తమిళ- తెలుగు సినిమాల్లో నటించింది. హనీ రోజ్ తెలుగులో తొలిసారి ఆలయం- ఈ వర్షం సాక్షిగా సినిమాల్లో నటించింది. నందమూరి బాలకృష్ణ హీరోగా వీర సింహా రెడ్డి (107వ సినిమా)తో హీరోయిన్ గా బిగ్ బ్రేక్ అందుకుంది.

## నాలుగు పదుల వయసులోనూ నీ యవ్వ తగ్గేదేలే

ఇష్టం సినిమా తో హీరోయిన్ గా రెండు దశాబ్దాల క్రితం ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ శ్రియ శరణ్ స్టార్ హీరోయిన్ గా ఒక వెలుగు వెలిగింది. ఈ రెండు దశాబ్దాల కాలంలో పుష్కర కాలం పాటు స్టార్ హీరోయిన్ గా వెలుగు వెలిగిన విషయం తెల్సిందే. ఇప్పుడు కూడా సినిమా ల్లో అడపాదడపా సినిమాలు చేస్తూ సోషల్ మీడియాలో అందాల ఆరబోత చేస్తూ అలరిస్తోంది. పెళ్లి అయ్యి తల్లి గా కూడా మారిన శ్రియ అందం విషయంలో మాత్రం పదేళ్ల క్రితం ఎలా ఉందో ఇప్పుడు కూడా అలాగే ఉంది. కొన్ని సార్లు ఇలాంటి హాట్ హాట్ కాస్ట్యూమ్స్ ధరించిన సమయంలో అంతకు మించి ఉ



న్నట్లు కనిపిస్తుంది. తాజాగా శ్రియ ఈ ఫొటోలు షేర్ చేసి క్లీ వేజ్ షో తో మతి పోగొడుతుంది. అందానికి వయసుతో సంబంధం ఏంటి అన్నట్టుగా ముద్దుగుమ్మ శ్రియ శరణ్ అందాల ఆరబోత చేస్తూ నాలుగు పదుల వయసులోనూ నీ యవ్వ తగ్గేదేలే అన్నట్లుగా దూసుకు పోతుంది. ఆకట్టుకునే ఫిజిక్ తో పాటు ఈ అమ్మడి యొక్క స్కిన్ టోన్ చాలా స్పెషల్ అంటూ అభిమానులు తెగ కామెంట్స్ చేస్తూ ఈ ఫొటోలను లైక్ చేస్తున్నారు. సిల్వర్ డ్రెస్ లో నడుము నాభి అందాన్ని చూపిస్తూ... క్లీ వేజ్ షో తో జీరో సైజ్ అందాన్ని చూపిస్తూ శ్రియ శరన్ పిచెక్కిస్తోంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేశారు.

సోషల్ మీడియాలో ప్రస్తుతం ఈ ఫొటోలు తెగ వైరల్ అవుతున్నాయి. ఆకట్టుకునే అందాల విందు ఈ అమ్మడి సొంతం అంటూ మరోసారి నిరూపితం అయ్యింది.




## మెగాఫోన్ పట్టే హీరోయిన్లు వీళ్లే!



సినీ పరిశ్రమ అంటే మేల్ డామినేటెడ్ ఇండస్ట్రీ. 24 శాఖల్లోనూ 95 శాతం వాళ్లే ఉంటారు. హీరోల దగ్గర నుంచి లైట్ బోయ్ వరకూ అన్ని పరిశ్రమల్లోనూ శాతం వాళ్లదే ఎక్కువే. అందులోనూ దర్శకుల సంఖ్య చూసుకుంటే మరీ అధికంగా కనిపిస్తుంది. వాళ్లకు ధీటుగా మహిళలు అన్ని శాఖల్లోరాణించాలని ఎప్పటి కప్పుడు తెరపైకి వస్తూనే ఉంటుంది. ముఖ్యంగా పారితోషికం విషయంలో స్టార్ హీరోలకు ఎందులో తక్కువంటూ సమాన హోదా కోసం గొంతెత్తిన భామలెంతో మంది. కానీ అది జరుగుతుంతో లేదో? తెలియదు గానీ! తాజాగా భవిష్యత్ లేడీ డైరెక్టర్లను మాత్రం చూడటానికి ఛాన్స్ కనిపిస్తుంది. అందులోనూ సౌత్ నుంచి ఎక్కువగా మహిళా దర్శకులు తయారయ్యే అవకాశం ఉందనిపిస్తుంది. క్రియేటి వ్ రంగంలోనూ రాణిస్తామంటూ కొంత మంది భామలు ఎప్పటికప్పుడు చెబుతుంటారు. వాళ్లలో శ్రుతి హాసన్ ముందుంటుంది. అమ్మడు మల్టీ ట్యాలెంటెడ్. గాయని..ప్లేబ్యాక్ సింగర్ గా...వాయిస్ ఆర్టిస్ట్ గా సత్తా చాటింది. త్వరలో దర్శకురాలిగానూ మారుతానంటూ చెప్పిన సందర్భాలెన్నో. మెగా ఫోన్ పట్టి తండ్రి కమల్ హాసన్ తరహాలో వైవిధ్యమైన సినిమాలు చేస్తానని అంటోంది. శ్రుతి హాసన్ పై అక్కడి పరిశ్రమ సైతం అంతే నమ్మకంతో ఉంది. తమిళ్ లో లేడీ డైరెక్టర్లు పెద్దగా కనిపించరు. ఈ నేపథ్యంలో భవిష్యత్ కోలీవుడ్ ఆశాకిరణంలా శ్రుతి హాసన్ ని చెప్పొచ్చు. అలాగే అదే పరిశ్రమకి చెందిన నివేదా పేతురాజు కూడా దర్శకురాలిగా రాణించాలని ఇటీవల ఓ సందర్భంలో రివీల్ చేసింది. ఖాళీ సమయంలో కథలు కూడా రాస్తానని రివీల్ చేసింది. అయితే ఆ బాధ్యతలు తీసుకోవడానికి మరికొంత సమయం పడుతుందని అంటుంది. అలాగే జూనియర్ సౌందర్యగా నీరాజనాలు అందుకుంటోన్న నిత్యామీనన్ కూడా క్రియేటివ్ రంగంలో రాణించాలని ఎంతో ఆశపడుతుంది. సరైన టైమ్ చూసుకుని కెప్టెన్ కుర్చీ ఎక్కేస్తానని ఇటీవలే ఓ సందర్భంలో తెలిపింది. ఇక మాలీవుడ్ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ కూడా దర్శకురాలిగా సత్తా చాటుతానంటోంది. నటిగా ప్రయాణానికి ఫుల్ స్టాప్ పెట్టిన తదుపరి దర్శకురాలిగా మారిపోతానంటుంది. అలాగే యువ సంచలనం ఫరియా అబ్దుల్లా కూడా మెగా ఫక్షన్ పట్టాలని చూస్తుంది. ప్రస్తుతానికి తనలో నటిని మాత్రమే చూస్తున్నారని....అంతర్గతంగా మంచి క్రియేటర్ దాగి ఉన్నాడు అన్న సంగతి ఏదో రోజు బయట పడుతుందని ధీమా వ్యక్తం చేసింది. మహిళలు ముందుకొస్తే మరిన్ని కొత్త కథలు రావడానికి అవకాశం ఉంది. భావోద్వేగాల్లో వైవిధ్యత..కొత్త తరహా పాత్రలు...లేడీ ఓరియేంటెడ్ చిత్రాలు రావడానికి ఛాన్స్ ఉంది.

## యువరాణి రూపానికి మతి భ్రమించాలంతే!





NTR 30 చిత్రంతో టాలీవుడ్ లో అడుగు పెడుతోంది కపూర్ కాంపౌండ్ యువరాణి జాన్వీ. అతిలోక సుందరి శ్రీదేవి నటవారసురాలి రాకతో తెలుగు లోగిళ్లు పునీతం కాబోతున్నాయంటూ అభిమానులు ఎంతో ఎగ్జయిట్ అవుతున్నారు. సోషల్ మీడియాల్లో జాన్వీకి వెల్ కం చెబుతూ తారక్ ఫ్యాన్స్ లవ్ హార్ట్ ఈమోజీలను షేర్ చేస్తున్నారు. ఆరంగేట్రమే యంగ్ యమ ఎన్టీఆర్ సరసన జాక్ పాట్ పట్టేసిందంటూ పొగిడేస్తున్నారు.

జాన్వీ బాలీవుడ్ నుంచి టాలీవుడ్ లో అడుగుపెట్టే క్రమంలో ఫోటోషూట్ల పరంగా మరింత దూకుడు పెంచింది. ఓవైపు హాట్ కంటెంట్ ని తనదైన శైలిలో ప్రెజెంట్ చేస్తూనే ట్రెడిషనల్ అవతార్ లో కనిపించేందుకు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇటీవల సౌత్ అభిమానులను దృష్టిలో ఉంచుకుని ఫోటోషూట్ల తీరుతెన్నులను మార్చేయడం గమనార్హం. కొద్ది కాలంగా జాన్వీ కపూర్ వరుస ఫోటోషూట్లు అంతర్జాలంలో సునామీని సృష్టిస్తున్నాయి. తాజాగా ఈ బ్యూటీ బంగారు తళుకుల ఫ్రాకులో ఎంతో అందంగా కనిపిస్తోంది. లేటెస్ట్ డిజైనర్ థై స్లిట్ ఫ్రాక్ లో జాన్వీ మునుపటి కంటే హాట్ గా కనిపిస్తోందంటూ అభిమానులు కితాబిచ్చేస్తున్నారు. ముఖ్యంగా తారక్ అభిమానులు జాన్వీ కపూర్ ఫోటోలను వైరల్ గా షేర్ చేస్తూ యువరాణి అంటూ తమ ప్రేమను కురిపిస్తున్నారు. ఆర్.ఆర్.ఆర్ లాంటి పాన్ ఇండియా హిట్ అందుకున్న తర్వాత యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన అవకాశం దక్కించుకున్న జాన్వీ నిజంగా అదృష్టవంతురాలు అంటూ కీర్తించేస్తున్నారు. బంగారు వర్ణం లాంగ్ ఫ్రాక్ లో జాన్వీ తళుకుబెళుకులు గుండెల్ని గుల్ల చేస్తున్నాయంటూ ఒక సెక్షన్ ఫ్యాన్స్ ప్రేమలో పడిపోయారు. ఓవరాల్ గా జాన్వీ గోల్డెన్ లుక్ ఫ్యాన్స్ గుండెల్లో బలమైన ముద్ర వేసిందనడంలో సందేహం లేదు. యంగ్ టైగర్ ఎన్టీఆర్ తన కెరీర్ 30వ సినిమాతో ల్యాండ్ మార్క్ హిట్ అందుకోవాలని తపిస్తున్నాడు. కొరటాల శివ దర్శకుడు కావడంతో ఈ మూవీ కోసం పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగుతున్నాడు. ఇలాంటి క్రేజీ ప్రాజెక్ట్ లో జాన్వీ కథానాయికగా అవకాశం అందుకుంది. ఈ సినిమాతో జాన్వీ పేరు దేశ విదేశాల్లో మార్మోగడం ఖాయమని విశ్లేషిస్తున్నారు. సరైన టైమ్ లో సరైన ప్రాజెక్ట్ తో జాన్వీ సౌత్ లో అడుగుపెడుతుండడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. జాన్వీ ఇటీవల ఎన్టీఆర్ 30 లాంచ్ ఈవెంట్ లో మాట్లాడుతూ.. ఎన్టీఆర్ సరసన నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని... టీమ్ సృష్టిస్తున్న ప్రపంచం ప్రేక్షకులను చాలా ఎగ్జయిట్ చేస్తుందని కితాబిచ్చింది. ఇటీవలే RRR సినిమాని మళ్లీ చూశానని అపారమైన చరిష్మా ఉన్న ఎన్టీఆర్ తో కలిసి నటించడం గొప్ప అవకాశమని దీనిని సద్వినియోగం చేసుకుంటానని జాన్వీ పేర్కొంది.

## హీరోలకు ధీటుగా 5కోట్లు చెల్లిస్తున్నారా?

కొందరికి అవకాశాలతో పాటు అదృష్టం కూడా ఇట్టే కలిసొచ్చేస్తుంది. అలాంటి అరుదైన కథానాయికల్లో ముంబై బ్యూటీ కియరా అద్వాణీ.. కన్నడ బ్యూటీ రష్మిక మందన్న ఉన్నారు. బుట్టబొమ్మ పూజా హెగ్డే నటిగా ఎదిగేందుకు చాలా సమయం తీసుకున్నా కానీ ఇటీవల ఈ బ్యూటీ స్టార్ డమ్ ఓ వెలుగు వెలుగుతోంది. ఆ తర్వాత టాలీవుడ్ లో వేగంగా దూసుకుపోయే ఛాన్స్ వేరే ఏ కథానాయికకు ఉంది? అంటే దీనికి సమాధానం దొరికింది. తాజా సమాచారం మేరకు ఇలా ఎన్టీఆర్ సరసన అడుగు పెడుతోందో లేదో ఇప్పటికే జాన్వీకపూర్ పై టాలీవుడ్ అగ్ర హీరోల కన్ను పడింది. నిజానికి రామ్ చరణ్ .. అల్లు అర్జున్ లేదా మహేష్ లాంటి స్టార్ హీరోల సరసన జాన్వీ కి నటించే అవకాశం వచ్చిందని ఇంతకుముందు




పుకార్లు వచ్చాయి. కానీ అవేవీ నిజాలు కావని ఆ తర్వాత ప్రూవైంది. ఇటీవలే NTR 30 టీమ్ లో చేరింది ఈ బ్యూటీ. తారక్ హీరో గా కొరటాల శివ తదుపరి చిత్రంలో జాన్వీ కపూర్ ని ఎంచుకున్నాడు. ఇప్పుడు చరణ్- మహేష్ లాంటి స్టార్ హీరోల సరసనా జాన్వీ కి అవకాశాలొస్తున్నాయని గుసగుస వినిపిస్తోంది.

మొన్నటికి మొన్న ఉప్పెన ఫేం బుచ్చిబాబు సనా దర్శకత్వంలో నటించేందుకు చరణ్ తో ప్లాన్ చేస్తున్నాడని. ఈ సినిమా కోసం జాన్వీ కి స్క్రిప్ట్ చెప్పడానికి సమయం తీసుకున్నట్లు చెబుతున్నారు. అలాగే రాజమౌళి బృందం కూడా మహేష్ బాబు ప్రధాన పాత్రలో తెరకెక్కనున్న భారీ చిత్రం కోసం హీరోయిన్ల కోసం వెతకడం ప్రారంభించారని కథనాలొస్తున్నాయి. ఈ ఇద్దరు హీరోల్లో ఎవరికి ఓకే చెప్పిందో జాన్వీనే చెప్పాల్సి ఉంది. ఒక్కో సినిమాకి టాలీవుడ్ యువహీరోలను మించి పారితోషికం అందుకుంటూ జాన్వీ కపూర్ ఆశ్చర్యపరుస్తోంది. ఈ భామ ఒక్కో కమిట్ మెంట్ కి సుమారు 5 కోట్లు డిమాండ్ చేస్తోందని తెలిసింది.

## ఒకే ఆకాశంలో నిండైన రెండు చందమామలు

ఒకే ఆకాశంలో రెండు చందమామలను ఎప్పుడైనా చూశారా? అయితే అలాంటి అరుదైన దృశ్యం ఇక్కడ సర్ ప్రైజ్ చేస్తోంది. ఒకటే ఫ్రేమ్.. కానీ రెండు చంద్ర బింబాలు మతులు చెడగొడుతున్నాయి. ఇంతకీ ఎక్కడి నుంచి పుట్టుకొచ్చారు నిండైన ఆ ఇద్దరు చందమామలు.. అంటే వివరాల్లోకి వెళ్లాలి. చందమామ అనగానే తెలుగు ప్రజలు ఇట్టే గుర్తు పట్టేస్తారు. ది గ్రేట్ కాజల్ అగర్వాల్ అని వెంటనే అభిమానులు తడుము కోకుండా చెప్పేస్తారు. ఇక చందమామ కాజల్ కెరీర్ అత్యుత్తమ దశలో ఉన్న క్రమంలోనే తన సోదరి నిషా అగర్వాల్ ని కూడా సినీరంగంలోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే.నిషా కొన్ని విజయవంతమైన చిత్రాల్లో నటించినా కానీ ఎందుకనో కెరీర్ పరంగా కాజల్ స్థాయిని అందుకోలేకపోయింది. కాజల్ అంత వైబ్రేంట్ కెరీర్ రన్ ని సాగించడంలో తడబడింది. ఇక




అవకాశాలు తగ్గే క్రమంలోనే పెళ్లి చేసుకుని లైఫ్ లో సెటిలైంది. నిషా వారసులను తన పెళ్లికి ముందు కాజల్ ఆటలాడిస్తూ.. సోదరి బిడ్డను తన బిడ్డగా మురిపెంగా చూసుకునేది. కానీ ఇప్పుడు తనకు కూడా పెళ్లయి ఒక బిడ్డకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. కాజల్- గౌతమ్ కిచ్లు జంటకు ఇటీవల బేబి బోయ్ జన్మించగా నీల్ అని నామకరణం చేసారు. ఇక ఇదంతా చందమామ సిస్టర్స్ గత హిస్టరీ అనుకుంటే.. వర్తమానంలో కాజల్- నిషా అగర్వాల్ లేటెస్ట్ ఫోటోషూట్ తో మతులు చెడగొడుతున్నారు. ఒకే ఫ్రేమ్ లో నిండైన రెండు చందమామలు వచ్చి చేరాయా? అన్నంత అందంగా ఈ ఫోటోషూట్ కుదిరింది. పాపులర్ ఆజా ఫ్యాషన్ మ్యాగజైన్ కోసం ఫోటోషూట్ ఇది. "సచ్ ఏ ఫన్ షూట్ విత్ మై ఫ్యాబ్యులస్ సిస్టర్!" అన్న లవ్ లీ క్యాప్షన్ తో కాజల్ అగర్వాల్ స్వయంగా ఈ ఫోటోలను ఇన్ స్టాలో షేర్ చేయగా అవి వైరల్ గా మారాయి. రకరకాల డిజైనర్ దుస్తుల్లో సిస్టర్స్ ఫోజులు యువతరం వాట్సాపుల్లో సోషల్ మీడియాల్లో జోరుగా షికార్ చేస్తున్నాయి. కాజల్ ఇటీవల కంబ్యాక్ విషయంలో సీరియస్ గా ఉంది. వరుసగా అగ్ర హీరోల సినిమాలకు సంతకాలు చేస్తున్న సంగతి తెలిసిందే. నటసింహా నందమూరి బాలకృష్ణ సరసన తొలిసారి తన కెరీర్ లో నటిస్తోంది. తదుపరి టాలీవుడ్ అగ్ర హీరోల సినిమాల్లో నటించేందుకు తహతహలాడుతోంది. అలాగే పెళ్లికి ముందు పలు భారీ క్రేజీ సినిమాల్లో ఆఫర్లు వచ్చినా కాజల్ తిరస్కరించిన సంగతి తెలిసిందే.




**(మొదటి పేజీ తరువాయి)** చెప్పినట్లు వినాలి. అట్లయితే బయ్యారంలో పెట్టొస్తది. అందుకే వాళ్లు పెట్టమని అంటున్నారు. బయ్యారం ఈజ్ నాట్ ఫీజబుల్ అని కిషన్ రెడ్డి అంటున్నడు. నాణ్యమైన ఐరన్ ఓర్ అదానీకి అప్పజెప్పినం కాబట్టి.. ఇట్ ఈజ్ నాట్ ఫీజబుల్ ఫర్ స్టీల్ అథారిటీ అని స్టేట్‌మెంట్ ఇచ్చిండు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టింది. అది ఎందుకు అమ్మకానికి పెట్టిర్రు అంటే.. గనులు ఇవ్వక, కేటాయింపులు చేయక.. ఇవ్వాల్సిన ఐరన్ ఓర్ ఇవ్వక దాన్ని బలవంతంగా నష్టాల్లోకి నెట్టారు. బైలదిల్లా నుంచి డైరెక్ట్‌గా ఐరన్‌ఓర్ ఇస్తే వైజాగ్ స్టీల్ కూడా నడుస్తుంది. కానీ ఇయ్యరు. ఇవ్వకుండా అదానీకి కట్టబెట్టి వైజాగ్ పొట్టకొట్టారు.

**నేను చెప్పింది తప్పయితే పరువు నష్టం దావా వేయండి –** బయ్యారం నుంచి బైలదిల్లా 150–160కిలోమీటర్లు. బైలదిల్లా నుంచి వైజాగ్ 600 కిలోమీటర్లు. అదే ముంద్రాకు 1800 కిలోమీటర్లు. ఇక్కడ ఫీజబుల్ కాదు.. కానీ తవ్వి 1800 కిలోమీటర్లు తీసుకెళ్తే ఫీజబుల్ ఎట్లయితది. ఇక్కడ ఉండే అజ్ఞాన బీజేపీ నాయకులు అర్థం చేసుకోకపోవచ్చు.. అర్థమైనా అదానీ కోసం నోరు మూసుకోవచ్చు. ఎందుకంటే వీళ్లు అజ్ఞాని, ఆయన ఆదానీ.. డెడ్లీ కాంబినేషన్. వీళు అర్థం చేసుకోకపోయినా తెలుగు ప్రజలు అర్థం చేసుకోవాలి. వైజాగ్ పొట్టకొడుతున్నది ప్రధాని, అదానీ.. బయ్యారం ఎండబెడుతున్నది కూడా ప్రధాని, ఆదానీయే. ఇక్కడ ఉండే అజ్ఞానికి.. ఆ ఆదానికి సంబంధం మాకు అవసరం లేదు. కానీ ప్రధాని, ఆదానీ కలిసి తెలుగు రాష్ట్రాల ప్రజల పొట్టుకొడుతున్నారనేది వాస్తవం. ఇది నిర్దిష్టమైన ఆధారాలతో చేస్తున్న ఆరోపణ. నేను చెప్పిన మాట తప్పయితే.. పరువు నష్టం దావా వేయండి.




## రంగంలోకి ఈడీ.. నాంపల్లి కోర్టులో పిటిషన్.. మరో ఇద్దరికి నోటీసులు

హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) పేపర్ లీకేజీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) రంగంలోకి దిగింది. నిందితులు ప్రవీణ్, రాజశేఖర్ రెడ్డి వాంగ్మూలాలను తీసుకోవాలని నిర్ణయించింది. ఈమేరకు వీరిద్దరి వాంగ్మూలాల నమోదుకు అనుమతి కోరుతూ నాంపల్లి కోర్టులో పిటిషన్ వేసింది. ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో భారీగా నగదు చేతులు మారినట్లు ఈడీ అనుమానిస్తోంది. మనీలాండరింగ్ జరిగినట్లు అంచనా వేస్తోంది. సిట్ అధికారులు సాక్షిగా పేర్కొన్న కాన్ఫిడెన్షియల్ సెక్షన్ ఆఫీసర్ శంకరలక్ష్మిపై ఈడీ ప్రధానంగా దృష్టి పెట్టింది. ఆమెతో పాటు టీఎస్‌పీఎస్సీకి చెందిన సత్యనారాయణకు ఈడీ నోటీసులు జారీ చేసింది. బుధ, గురువారాల్లో విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది. మరోవైపు ప్రవీణ్, రాజశేఖర్‌లను కస్టడీకి తీసుకొని ఈడీ విచారించనుంది. ఈ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఇవాళ హైకోర్టుకు నివేదిక సమర్పించనుంది. నెల రోజుల పాటు దర్యాప్తు కొనసాగించిన సిట్ అధికారులు.. మొత్తం 17 మందిని అరెస్ట్ చేశారు. వారిలో 15 మందిని కస్టడీకి తీసుకుని పలు వివరాలు రాబట్టారు. దాదాపు 150 మందిని విచారించిన అధికారులు.. టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ జనార్దన్‌రెడ్డి, కార్యదర్శి అనితా రామచంద్రన్, సభ్యుడు లింగారెడ్డి సహా పలువురి వాంగ్మూలాలను నమోదు చేశారు. దర్యాప్తు నివేదికలో నిందితుల పెన్‌డ్రైవ్, మొబైల్స్‌లో ప్రశ్నపత్రాలు ఉన్నట్లు గుర్తించిన సెంట్రల్ ఫొరెన్సిక్ సైన్స్ ల్యాబరేటరీ నివేదికనూ జతపరిచారు.

## నిజామాబాద్ మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ ఇంటిపై దాడి



నిజామాబాద్ మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ ఇంటి వద్ద సందీప్ వర్మ అనే వ్యక్తి హంగామా సృష్టించాడు. కారుతో ఇంటి గేటు, వాహనాలను ధ్వంసం చేశాడు. సుమారు 20 నిమిషాలపాటు సందీవ్ వర్మ రచ్చ రచ్చ చేశాడు. అసలు ఏం జరగుతుందో తెలియక సంజయ్ కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. సంజయ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఇద్దురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గత కొంత కాలంగా డీఎస్ తనయులు అరవింద్, సంజయ్‌ల మధ్య విభేదాలు ఉన్న విషయం తెలిసిందే. ఇద్దరికీ రాజకీయంగా పడట్లేదు. తండ్రి డి శ్రీనివాస్‌తోపాటు సంజయ్ ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే సంజయ్ తమ్ముడు, బీజేపీ ఎంపీ అరవింద్‌కు ఇది నచ్చట్లేదు. తండ్రిపై ఒత్తిడి తీసుకొచ్చి మరుసటి రోజే కాంగ్రెస్‌కు రాజీనామా చేయించారు. దీన్నంతా అరవింద్ కుట్రగా సంజయ్ చెప్పారు.

## వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను సందర్శించిన ముగ్గురు సింగరేణి డైరెక్టర్లు.. టేకోవర్ సాధ్యాసాధ్యాలపై చర్చ



వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను టేకోవర్ చేసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సింగరేణి జాయింట్ వెంచర్ కింద ఉక్కు పరిశ్రమ టేకోవర్‌పై సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేపట్టింది. ఈ క్రమంలో వైజాగ్ స్టీల్ ప్లాంట్ వెళ్లి అక్కడి పరిస్థితులను సమీక్షించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా సింగరేణి సీఎండీ ఆదేశాల మేరకు ముగ్గురు డైరెక్టర్లు మంగళవారం విశాఖకు వెళ్లారు. అక్కడి స్టీల్ ప్లాంట్‌ను పరిశీలించారు.

## కేసీఆర్‌పై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదు: ఎంపీ నామా



ఖమ్మం జిల్లా: సత్తుపల్లిలో బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ నామా నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'నేను రైతు బిడ్డని, చిన్నప్పటి నుంచి కష్టాలు చూసినవాడిని.. తెలంగాణా రాకముందు బ్రతుకు దెరువు కోసం వలసలు ఉండేవని గుర్తు చేశారు'. 9 ఏళ్ళ కాలంలో అనేక పథకాలను కేసీఆర్ ప్రవేశ పెట్టారని వేలాది కోట్ల రూపాయలను పట్టణాల అభివృద్ధికి ఖర్చు చేశారని కొనియాడారు. తెలంగాణ మీద కన్నుగుట్టి రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ఆపాలని కేంద్ర ప్రభుత్వం మాయ మాటలు చెబుతోందని ధ్వజమెత్తారు. ఒక ఎంపీని పిలవకుండా హైదరాబాద్‌లో కార్యక్రమాలు చేశారని మండిపడ్డారు. ప్రజా ప్రతినిధులను అవమాన పరిచేలా పొంగులేటి మాట్లాడటంపై అసహనం వ్యక్తం చేశారు. విమర్శించే ముందు చరిత్ర తెలుసుకోవాల్సిన మాట్లాడాల్సిన అవసరం ఉందని, ఇటువంటి పద్ధతులు మార్చుకోవాలని హితవు పలికారు. కేసీఆర్‌పై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని ఫైర్ అయ్యారు. ఏ ఎన్నికలైన ఖమ్మం ప్రజలు సీఎంకు అండగా ఉంటారని పేర్కొన్నారు. అనేక సేవా కార్యక్రమాల చేస్తున్న పార్థ సారథి రెడ్డి పై బండి సంజయ్ విమర్శలు చేయటం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు.



## టీహబ్‌లో మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఆదిత్య థాకరే

హైదరాబాద్: శివసేన ఎమ్మెల్యే ఆదిత్య థాకరే ఇవాళ హైదరాబాద్‌లోని టీహబ్‌ను సందర్శించారు.

అక్కడ మంత్రి కేటీఆర్‌తో ఆయన చర్చలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో తన ట్విట్టర్‌లో ఆదిత్య థాకరే స్పందిస్తూ.. మంత్రి కేటీఆర్‌ను కలిసిన ప్రతిసారి అద్భుతంగా, ఎంకరేజింగ్ ఫీలవుతానని అన్నారు. సుస్థిరత, పట్టణీకరణ, సాంకేతికత లాంటి అంశాలపై ఇద్దరం చర్చించుకున్నామని, భారత దేశ ప్రగతిలో ఆ అంశాలు కీలకమైనవన్న విషయాన్ని ప్రస్తావించుకున్నట్లు ఆదిత్య థాకరే తెలిపారు.

టీహబ్‌లో జరిగిన వర్క్ గురించి ఆదిత్య థాకరే స్టన్ అయ్యారు. టీహబ్ మహాద్భుతంగా ఉందన్నారు. స్టార్ట్ అప్‌లు, ఆవిష్కర్తలు, ఆలోచనాపరులకు టీహబ్ మంచి ఊతం ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ఈ నెల 25న ప్రతి గ్రామంలో గులాబీ జెండా ఎగురవేయాలి.. బీఆర్ఎస్ కార్యకర్తలకు కేటీఆర్ పిలుపు



హైదరాబాద్ : బీఆర్ఎస్ ఆవిర్భావం సందర్భంగా ఈ నెల 25న నియోజకవర్గ స్థాయి సమావేశాలను విజయవంతంగా నిర్వహించాలని మంత్రి కేటీఆర్ సూచించారు.

ప్రతి గ్రామంలో, మున్సిపల్ వార్డులో ప్రతి డివిజన్‌లో పార్టీ జెండా ఎగురవేసి.. సమావేశం నిర్వహించే బాధ్యత నియోజకవర్గ ఇన్‌ఛార్జిలదే అని మంత్రి కేటీఆర్ మరోసారి సూచించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాడు భారత రాష్ట్ర సమితి కేంద్ర కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో పార్టీ అధ్యక్షులు కేసీఆర్ నాయకత్వంలో సర్వసభ్య సమావేశం జరుగుతుందని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఈ సమావేశాల్లో భాగంగా పార్టీ పతాక ఆవిష్కరణ చేసి.. పలు అంశాలపై తీర్మానాలు, చర్చలు జరుపుతామని వెల్లడించారు. 22 సంవత్సరాల ప్రస్థానం పూర్తి చేసుకుని 23వ ఏట పార్టీ అడుగుపెడుతున్న సందర్భంగా అన్ని అంశాలపై సావధానంగా చర్చిస్తారని తెలిపారు. తెలంగాణలో జరగబోయే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సన్నద్ధతపై కూడా చర్చించడం జరుగుతుందని చెప్పారు. ' ఇప్పటికే ఆత్మీయ సమ్మేళనాలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నాయి. కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో బహిరంగ సభల స్థాయిలో జరుగుతున్నాయి. వాటిని కూడా మే నెలాఖరు వరకు పొడిగించాం. పార్టీ అన్నిరకాలుగా ఎన్నికలతో పాటు అన్ని పోరాటాలకు సన్నద్ధంగా ఉండాలని.. ఎప్పటికప్పుడు కార్యకర్తలతో సంభాషణ జరగాలని ఈ ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటుచేశాం. ఇవి చక్కగా జరుగుతున్నాయి. అక్కడక్కడ మా దృష్టికి వచ్చినచిన్న ఇబ్బందులను కరెక్ట్ చేసుకుని ముందుకెళ్తాం. ' అని తెలిపారు.




## బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు గాయం

హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత గాయపడ్డారు. కాలుకు ఫ్రాక్చర్ అవడంతో వైద్యుల సూచన మేరకు ఇంట్లో విశ్రాంతి తీసుకోనున్నారు. మూడు వారాల పాటు కవిత రెస్ట్ తీసుకోనున్నారు. ఈ విషయాన్ని కవిత ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. "కాలు ఫ్రాక్చర్ కావడంతో మూడు వారాలు విశ్రాంతి తీసుకోవాల్సిందిగా వైద్యుల సూచన. ఎలాంటి సహాయమైనా లేదా సమాచారం కోసం నా ఆఫీసు అందుబాటులో ఉంటుంది" అంటూ కవిత ట్వీట్ చేశారు. కవిత గాయపడిన విషయం తెలిసిన బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు ఆందోళన వ్యక్తం చేశారు. కవిత త్వరగా కోలుకోవాలంటూ అభిమానులు, కార్యకర్తలు రీ ట్వీట్లు చేస్తున్నారు.


## బెల్లంపల్లి ఎమ్మెల్యేకు ప్రగతిభవన్ లో క్లాస్?



హైదరాబాద్ : అనూహ్యంలో వార్తల్లోకి వచ్చిన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు క్లాస్ పడిందా? అంటే అవునన్న మాట వినిపిస్తోంది. ఇటీవల ఒక డెయిరీ ఎపిసోడ్ లో సంస్థకు చెందిన భాగస్వామి అయిన ఒక మహిళ (ఆరిజన్ డెయిరీ డైరెక్టర్ షెజల్) విషయంలో గులాబీ ఎమ్మెల్యే వ్యవహరించిన తీరుపై సంచలన ఆరోపణలు రావటం తెలిసిందే. దీనికి సంబంధించి సదరు డెయిరీ సంస్థకు చెందిన షెజల్ ప్రెస్ మీట్ పెట్టి మరీ ఎమ్మెల్యే తీరును తప్పు పట్టటమే కాదు.. ఏ తరహాలో బెదిరింపులకు పాల్పడింది.. వేధింపులకు గురి చేసింది చెప్పుకొచ్చారు. దీంతో.. దుర్గం చిన్నయ్య ఒక్కసారిగా వార్తల్లోకి వచ్చారు. ఆయన తీరు హాట్ టాపిక్ గా మారింది. ఇలాంటి వేళ.. ఎమ్మెల్యేకు ప్రగతిభవన్ నుంచి పిలుపు వచ్చింది. మీడియాలోనూ.. సోషల్ మీడియాలోనూ వచ్చిన ఆరోపణలతో నిఘా వర్గాలు అలెర్టు అయి.. ప్రభుత్వానికి ఒక నివేదికను ఇచ్చినట్లుగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన్ను సోమవారం ప్రగతిభవన్ కు రావాలంటూ కబురు వచ్చింది. దీంతో ఆయన ప్రగతి భవన్ కు వెళ్లారు. అయితే.. సోమవారం వివిధ కార్యక్రమాల్లో బిజీగా ఉన్న కారణంగా మంత్రి కేటీఆర్ ఆయన్ను కలిసేందుకు సమయం దొరకలేదు. దీంతో.. మంగళవారం మరోసారి రావాలని పేర్కొన్నారు. దీంతో.. మంగళవారం మళ్లీ ప్రగతి భవన్ కు వెళ్లిన ఆయనకు.. మంత్రి కమ్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా వ్యవహరిస్తున్న కేటీఆర్ తో భేటీ అయ్యే అవకాశం దక్కింది. ఈ సందర్భంగా సుతిమెత్తగా దుర్గం చిన్నయ్య తీరును కేటీఆర్ తప్పు పట్టినట్లుగా చెబుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. అనవసరమైన వివాదాల జోలికి వెళ్లొద్దంటూ హెచ్చరించినట్లుగా చెబుతున్నారు. అయితే.. తనపై వచ్చిన ఆరోపణలకు ఎమ్మెల్యే వివరణ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. డెయిర్ పెట్టిన నిర్వాహకులు రైతుల్ని మోసం చేశారని.. దీంతో వారు పోలీసులకు కంప్లైంట్ చేయటంతో విషయం తన వరకు వచ్చిందన్నారు. ఈ క్రమంలో వారిని తాను అరెస్టుచేయించినట్లుగా చెప్పగా.. ఎన్నికల వేళ వివాదాలకు దూరంగా ఉండాలన్న మాట చెప్పి.. జాగ్రత్తగా ఉండాలన్న మాటతో ఆయన్ను పంపినట్లుగా తెలుస్తోంది.

## కమలాపూర్ టెన్త్ పేపర్ లీక్ కేసులో నిందితులకు బెయిల్.. పోలీస్ కస్టడీ పిటిషన్ డిస్మిస్

వరంగల్: కమలాపూర్‌లో టెన్త్ పేపర్ లీక్ వ్యవహారానికి సంబంధించిన కేసులో.. నిందితులకు కోర్టు ఊరట లభించింది. ముగ్గురికి మంగళవారం బెయిల్ మంజూరు చేసింది స్థానిక కోర్టు. ఈ కేసులో ఏ2గా ఉన్న ప్రశాంత్, ఏ3 మహేష్, ఏ5 శివగణేష్ కు బెయిల్ ఇచ్చింది కోర్టు. అలాగే.. పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్ ను డిస్మిస్ చేశారు మెజిస్ట్రేట్. ఇదిలా ఉంటే.. పోలీస్ కస్టడీ పిటిషన్, బెయిల్ పిటిషన్‌లపై నిన్న(సోమవారం) సైతం వాదనలు జరిగాయి. కస్టడీ పిటిషన్ వేసిన దృష్ట్యా బెయిల్ ఇవ్వద్దని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు. ఈ కేసులో ఏ1గా ఉన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కి బెయిల్ లభించడంతో.. మిగతా నిందితులకూ బెయిల్ మంజూరు చేయాలని నిందితుల తరపున న్యాయవాదులు కోరారు. వాదోపవాదనల అనంతరం తీర్పును ఈరోజు(మంగళవారం) వాయిదా వేసిన మెజిస్ట్రేట్. చివరకు.. బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.



Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com